www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -165 సోమవారం15 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళలు రాణించాలి

- తిరుపతిలో జాతీయ మహిళా సాధికారత కమిటీల సదస్సు ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- మహిళా సాధికారతతోనే వికసిత్ భారత్ సాధ్యమన్న స్పీకర్
- 'నారీశక్తి వందన్' చట్టం ఒక చారిత్రాత్మక సంస్కరణ అని ప్రశంస
- 20కి పైగా రాష్ట్రాల నుంచి సదస్సుకు హాజరైన ప్రతినిధులు

2లో.



## సూపర్ విక్టరీ

### ఆసియా కప్ 2025లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

- తొలుత పాకిస్థాన్ స్కోరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులు
- అద్భుతంగా రాణించిన భారత స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్
- 25 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్

హైదరాబాద్/ **సెప్టెంబర్ 14 ప్రజావినికిడి,**-ఆసియా కప్ 2025లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం చెలాయించి 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. భారత బౌలర్ల ధాటికి పాకిస్థాన్ బ్యాటర్లు చేతులెత్తేయగా, 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా సునాయాసంగా ఛేదించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. సూర్య చివర్లో సిక్స్ కొట్టి మ్యాచ్ ను ముగించడం హైలైట్ గా నిలిచింది.
దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన మిగతాది 2లో...



## మోదీ,బాబు నాయకత్వంలో ప్రగతి పథంలో ఏపీ

### విశాఖలో బీజేపీ 'సారథ్యం' యాత్ర లో జేపీ నడ్డా

- వైసీపీ అవినీతి పాలనకు మోదీ, బాబు ముగింపు పలికారు
- గత పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందంటూ తీవ్ర విమర్శలు
- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం పటిష్టంగా ఉందని వెల్లడి

**విశాఖ సెప్టెంబర్ 14 ప్రజావినికిడి,**
ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అవినీతి, అప్రజాస్వామిక విధానాలతో అంధకారంలోకి వెళ్లిపోయిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ చీకటి రోజులకు చరమగీతం పాడారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. మోదీ, చంద్రబాబుల సమర్థవంతమైనమిగతాది 2లో...




## మంత్రి నారా లోకేశ్ పుత్రోత్సాహం...

- లండన్ లో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారం అందుకున్న దేవాన్ష్
- చదరంగంలో దూసుకుపోతున్న నారా దేవాన్ష్
- 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డుకు అరుదైన గుర్తింపు
- కుమారుడి అవార్డు ప్రదానోత్సవానికి హాజరైన మంత్రి నారా లోకేశ్
- దేవాన్ష్ ఘనత చూసి గర్వపడుతున్నానని లోకేశ్ వెల్లడి
- పదేళ్ల వయసులోనే ఇప్పటికే మూడు ప్రపంచ రికార్డులు నెలకొల్పిన చిన్నారి
- వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో ఘనంగా జరిగిన పురస్కార ప్రదానోత్సవం



2లో.

## బెగ్గర్ హోమ్‌లు జైళ్లలా ఉండరాదు

- బిచ్చగాళ్ల వసతి గృహాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- చేరిన 24 గంటల్లో యాచకులకు వైద్య పరీక్షలు తప్పనిసరి
- పౌష్టికాహారం, పరిశుభ్రత, నైపుణ్య శిక్షణ అందించాలి
- నిర్లక్ష్యంతో మరణిస్తే అధికారులపై చర్యలు, పరిహారం
- నివాసితులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాలి
- ఆరు నెలల్లో మార్గదర్శకాలు అమలు చేయాలని ఆదేశం



## 200 రోజులు గడిచినా మృతదేహాలు వెలికితీయరా?..

### రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

- ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి 200 రోజులు పూర్తి
- ఆరుగురు మృతదేహాలు ఇంకా వెలికితీయని ప్రభుత్వం
- కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర విమర్శలు
- బాధితులకు పరిహారం కూడా ఇవ్వలేదని ఆరోపణ
- ఈ ఘటనపై బీజేపీ మౌనాన్ని ప్రశ్నించిన కేటీఆర్



హైదరాబాద్/ **సెప్టెంబర్ 14 ప్రజావినికిడి,**
శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కూలిన ఘటన జరిగి 200 రోజులు దాటినా ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ సర్కారు నేరపూరిత నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆయన ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. మిగతాది 2లో...

## జూబ్లీహిల్స్‌లో గెలిచి తీరాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులకు, కా ర్యకర్తలకు పిలుపు



హైదరాబాద్/ **సెప్టెంబర్ 14ప్రజావినికిడి,**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికలో గెలుపొందినట్టే జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగబోయే ఉప ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థిని గెలిపించి అధిష్టానానికి కానుకగా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులకు, కా ర్యకర్తలకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మె ల్సీ బి.మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి సు ధాకర్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, అభ్య ర్థి ఎంపికను అధిష్టానం చూసుకుంటుందని చెప్పా రుమిగతాది 2లో...



## నేటినుంచి కాలేజీలు నిరవధిక బంద్

- ఇంజినీరింగ్, వృత్తివిద్యా, డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్
- ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి
- టోకెన్లు ఇచ్చిన రూ.1800 కోట్లు 21లోగా చెల్లించాలి
- ఈనెల 23 లేదా 24న హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ

హైదరాబాద్/ **సెప్టెంబర్ 14 ప్రజావినికిడి,**
రాష్ట్రంలో ఇంజినీరింగ్‌సహా వృత్తి విద్యా కాలేజీలు, డిగ్రీ, పీజీ కాలేజీలు సోమవారం నుంచి మూతపడనున్నాయి. కాలేజీలకు తాళం వేయాలని కాలేజీ యాజమాన్యాలు నిర్ణయించాయి. నిరవధిక బంద్ చేయనున్నట్టు ప్రకటించాయి. వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఈడీ పరీక్షలను బహిష్కరించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.ఎనిమిది వేల కోట్లను వెంటనే విడుదల చేయాలంటూ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఏటీహెచ్ఐ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. మిగతాది 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మహిళా సాధికారత .. సాకార దిశగా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పార్లమెంటరీ కమిటీ చైర్ పర్సన్, ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరి



లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా గారికి జ్ఞాపికను అందజేస్తున్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మంత్రి పయ్యావులకేశవ్ తదితరులు



జాతీయస్థాయి సదస్సులో పాల్గొన్న లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్,శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్,పార్లమెంటరీ కమిటీ చైర్ పర్సన్, ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరి తదితరులు

**తిరుపతి ప్రతినిధి, సెప్టెంబర్ 14, ప్రజావినికిడి,**
దేశంలో తొలి జాతీయ మహిళా సాధికారత సాధనకు దిశగా కీలక నిర్ణయాలు తీసుకునేందుకు పార్లమెంటరీ,శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సును తిరుపతి వేదికగా నిర్వహిస్తున్నారు. తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్ లో ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు జరగనున్న తొలి జాతీయస్థాయి కాన్ఫరెన్స్ అఫ్ పార్లమెంటరీ , లెజిస్లేటివ్ కమిటీస్ ఆన్ ఎంపవర్మెంట్ ఆఫ్ విమెన్ (తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు) ఆదివారం ప్రారంభమైంది. జాతీయ స్థాయిలో జరిగే సదస్సుకు దేశం నలమూలల నుంచి మహిళా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య సభ్యులు హాజరుకానున్న ఈ సమావేశాన్ని గుర్తుండిపోయేలా చేపడుతున్నారు.

**సాధికారిక అజెండా అంశాలు: -**
దేశం నలమూలల నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొననున్నారు."కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొని మహిళా సాధికారిత" అంశాలను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కల్పిస్తూ " వికసిత్ భారత్ కోసం మహిళా ఆధ్వర్యంలో అభివృద్ధి" అనే అంశాలను చర్చించనున్నారు. బయో సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ, ఏఐ, రోబో టిక్స్, డిజిటల్ భద్రత, వ్యవసాయ రంగాల్లో ఉన్న సవాళ్లపై చర్చించి తీర్మానం చేయనున్నారు.

**ప్రధాన అంశాల నిర్వహణ: -**
తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్ లో జరిగే ప్రారంభోత్సవ సమావేశానికి లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా , రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ,పార్లమెంటరీ కమిటీ (మహిళా సాధికారత) చైర్ పర్సన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం అతిథులకు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి మహిళా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు జాతీయస్థాయి ముఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళలు రాణించాలి

**: తిరుపతిలో స్పీకర్ ఓం బిర్లా**

**తిరుపతి ప్రతినిధి, సెప్టెంబర్ 14ప్రజావినికిడి,**
మహిళలు విద్యావంతులై, స్వావలంబన సాధించినప్పుడే భారత్ సమ్మిళిత, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. మహిళా నేతృత్వంలో సాగే అభివృద్ధే 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడానికి బలమైన పునాది అని ఆయన అన్నారు. తిరుపతిలో తొలిసారిగా నిర్వహిస్తున్న పార్లమెంటు, రాష్ట్రాల మహిళా సాధికారత కమిటీల జాతీయ సదస్సును ఆయన ఆదివారం ప్రారంభించారు.'వికసిత్ భారత్ కోసం మహిళా నేతృత్వంలో అభివృద్ధి' అనే ప్రధాన అంశంతో ఈ రెండు రోజుల సదస్సు జరుగుతోంది. మహిళల అవసరాలకు తగిన బడ్జెట్ రూపకల్పన, ఆధునిక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేలా మహిళలను శక్తివంతం చేయడం వంటి కీలక అంశాలపై ఇందులో చర్చిస్తారు. ఈ జాతీయ సదస్సుకు 20కి పైగా రాష్ట్రాల నుంచి చట్టసభల ప్రతినిధులు, విధాన రూపకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ, దేశ ప్రగతిలో మహిళా సాధికారత, శిశు సంక్షేమం అనేవి సాధారణ అంశాలు కాదని, అవే దేశానికి పునాదులని నొక్కిచెప్పారు. పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు ప్రతి స్థాయిలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. చట్టాలు, విధానాల రూపకల్పనలో మహిళల పాత్ర పెరిగినప్పుడే వారు చారిత్రకంగా ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించగలరని తెలిపారు. ప్రభుత్వ నిబద్ధతకు 'నారీశక్తి వందన్ అధినియమ్' బిల్లు ఒక చారిత్రక నిదర్శనమని ఓం బిర్లా కొనియాడారు. కొత్త పార్లమెంటు భవనంలో ఆమోదం పొందిన తొలి బిల్లు ఇదేనని గుర్తుచేశారు. ఈ చట్టం ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే కొత్త తరం మహిళా నాయకులను సిద్ధం చేస్తుందని ఆయన వివరించారు.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మోదీ,బాబు నాయకత్వంలో ప్రగతి పథంలో ఏపీ

**(మొదటి పేజి తరువాయి)**
నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని అన్నారు.
విశాఖపట్నంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన 'సారథ్యం' యాత్ర ముగింపు సభకు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "2014కు ముందు దేశంలో వారసత్వ, అవినీతి రాజకీయాలు రాజ్యమేలాయి. అదే తరహాలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైంది. రాష్ట్ర ప్రజలను గత పాలకులు దారుణంగా మోసం చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు" అని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఏపీ మళ్లీ పునరుజ్జీవనం పొందుతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' అనే నినాదంతో దేశం ముందుకు సాగుతోందని నడ్డా గుర్తుచేశారు. దశాబ్దాల నాటి అయోధ్య రామమందిర కలను సాకారం చేయడం, ట్రిపుల్ తలాక్ రద్దు, జీఎస్టీ వంటి చారిత్రక సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానిదేనని ఆయన కొనియాడారు.
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన నడ్డా, రాష్ట్రానికి కేటాయించిన పలు కీలక ప్రాజెక్టులను ప్రస్తావించారు. సాగర్ మాల పథకం కింద 14 పోర్టుల నిర్మాణం, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతిలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడం, జాతీయ రహదారుల విస్తరణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం పెద్దపీట వేస్తోందన్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో పది కేంద్ర విద్యాసంస్థలు, ఆరు కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి రూ.625 కోట్ల నిధులు విడుదల చేశామని, దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు, అమృత్ భారత్, వందే భారత్ వంటి ఆధునిక రైల్వే సేవలతో రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని వివరించారు.
ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని బలోపేతం చేయడంతో పాటు, మిత్రపక్షాలైన టీడీపీ, జనసేనలతో కలిసికట్టుగా పనిచేస్తామనే స్పష్టమైన సందేశాన్ని ఈ సభ ద్వారా నడ్డా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం స్థిరంగా ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో గెలిచి తీరాలి

**(మొదటి పేజి తరువాయి)**
అయితే గెలిపించే బాధ్యతను మనం అందర మూ తీసుకోవాలన్నారు. భారీ మెజారిటీతో అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆయన సూచించారు. దీనికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం తో ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా పోలిం గ్ కేంద్రం వరకూ కమిటీలు, కార్యకర్తలు బాధ్యతతో పని చేయాలన్నారు. దీనిని పార్టీ నాయకులు జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. మీకు ఏదైనా అనుమానం, సందేహాలు, సమస్యలు వస్తే వెంటనే సంబంధిత మంత్రులను సంప్రదించాల ని, ఇంకా అవసరమైతే తననూ కలవవచ్చని అన్నా రు. ప్రభుత్వం చేపట్టిన, ఇంకా చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ కార్యకర్తలు వెళ్ళాలని, గ్రూపు మీటింగ్‌లు నిర్వహించుకోవాలని, అపార్ట్‌మెంట్స్‌ల వారీగా సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## నెలాఖరులోగా నోటిఫికేషన్..

ఇదిలాఉండగా ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఈ నియోజకవర్గం గెలుపొందడం ద్వారా ప్రభుత్వ పని తీరు పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్న సంకేతాలను రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా పంపించేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు చాలా మంది నేతలు పోటీ పడడం సంతోషకరమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి సాంప్రదాయమేనని ఆయన తెలిపారు. అయితే అభ్యర్థి ఎంపిక మన చేతిలో లేదని, దీనిని అధిష్టానమే చూసుకుంటుందన్నారు. ఎంత మంది పోటీకి ఉత్సాహపడినా, అభ్యర్థి ఖరారైన తర్వాత మాత్రం అందరూ సమిష్టిగా పని చేసి అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆయన సూచించారు. టిక్కెట్ రాలేదని ఎవరూ నిరుత్సాహపడరాదని, వారి సేవలను పార్టీ నాయకత్వం మరో రూపంలో వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఇంకా ఈ సమావేశంలో జిహెచ్ఎంసి మేయర్ జి. విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పోరేషన్ల చైర్మన్లు బెల్లయ్య నాయక్, శోభా రాణి, వివిధ డివిజన్లకు ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కార్పోరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి కాలేజీలు

# నిరవధిక బంద్

**(మొదటి పేజి తరువాయి)**
విద్యార్థులెవరూ కాలేజీలకు రావొద్దంటూ కోరుతున్నది. ఆదివారం హైదరాబాద్‌లో ఎఫ‌ఏటీహెచ్ఐ అత్యవసర జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో ఎఫ్ఏటీహెచ్ఐ చైర్మెన్ నిమ్మటూరి రమేష్‌బాబు మాట్లాడుతూ సోమవారం నుంచి కాలేజీలను నిరవధికంగా మూసేయాలని నిర్ణయించామని చెప్పారు. అటెండర్లు, స్వీపర్లు, ఫ్యాకల్టీ, యాజమాన్యాలు ఎవరూ రారనీ, కాలేజీలకు తాళాలు వేస్తామని ప్రకటించారు.ఈనెల 21 నాటికి ఆర్థిక శాఖ టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,500 కోట్ల నుంచి రూ.1,800 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కింద టోకెన్లు ఇచ్చిందన్నారు. వచ్చేనెల 31 నాటికి ఫీజు బకాయిల్లో సగం, మిగిలిన సగం డిసెంబర్ 31 నాటికి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి మార్చి 31 నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు విడతలు లేదా మూడు విడతల్లో ఫీజులను చెల్లిస్తామంటూ ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. ఇతర విషయాల్లో ప్రభుత్వానికి యాజమాన్యాలు సహకరిస్తాయని అన్నారు. పాత బకాయిలు ఈ ప్రభుత్వానికి సంబంధం లేదనడం సరైంది కాదన్నారు. కాంట్రాక్టర్లు బెదిరించి డబ్బులు తీసుకెళ్లారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు కేటాయిస్తున్నారని వివరించారు. కాలేజీ యాజమాన్యాలు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టకుండా ఇంతకాలం ఓపిక పట్టామని అన్నారు. ఈనెల 23 లేదా 24న హైదరాబాద్‌లో లక్ష మంది విద్యార్థులతో భారీ బహిరంగసభను నిర్వహిస్తామని చెప్పారు. రకరకాల కారణాలతో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం లేదన్నారు.

# సూపర్ విక్టరీ

**(మొదటి పేజి తరువాయి)**
పాకిస్థాన్ కెప్టెన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, వారి నిర్ణయం బెడిసికొట్టింది. ఆరంభం నుంచే భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పాక్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (3/18), అక్షర్ పటేల్ (2/18) తమ మాయాజాలంతో పాక్ మిడిల్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. వీరితో పాటు జస్‌ప్రీత్ బుమ్రా కూడా రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఒక దశలో పాకిస్థాన్ 100 పరుగులు చేయడం కూడా కష్టమే అనిపించింది. చివర్లో షాహీన్ అఫ్రిది కేవలం 16 బంతుల్లో 4 సిక్సర్లతో 33 పరుగులు చేయడంతో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది.
అనంతరం 128 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. అభిషేక్ శర్మ కేవలం 13 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 31 పరుగులు చేసి పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయినప్పటికీ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (47 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. తిలక్ వర్మ (31) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివరకు భారత్ 15.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి, మరో 25 బంతులు మిగిలి ఉండగానే సునాయాస విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో టోర్నీలో టీమిండియా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది.

# బెగ్గర్ హెూమ్‌లు జైళ్లలా ఉండరాదు

**బిచ్చగాళ్ల వసతి గృహాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు**

దేశవ్యాప్తంగా ఉన్న యాచకుల వసతి గృహాలు (బెగ్గర్ హెూమ్‌లు) శిక్షా కేంద్రాలుగా కాకుండా, గౌరవప్రదమైన పునరావాస కేంద్రాలుగా మారాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇవి జైళ్లను తలపించేలా ఉండకూడదని, నివాసితుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని తేల్చిచెప్పింది. ఢిల్లీలోని లంపూర్ బెగ్గర్ హెూమ్‌లో కలుషిత నీటి కారణంగా నివాసితులు మరణించిన ఘటనపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చారిత్రక ఆదేశాలు జారీ చేసింది.
"బెగ్గర్ హెూమ్‌ల పాత్ర శిక్షించేలా కాకుండా, బాధితులను కోలుకునేలా చేసి, వారిలో నైపుణ్యాలు పెంచి, తిరిగి సమాజంలో కలిసేలా చేసేదిగా ఉండాలి. 'హెూమ్' (ఇల్లు) అనే పదానికే భద్రత, గౌరవం, సంరక్షణ అనే అర్థాలున్నాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అధిక జనాభా, అపరిశుభ్రత, వైద్య సదుపాయాల లేమి వంటి పరిస్థితులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును కాలరాయడమేనని కోర్టు పేర్కొంది. పేదరికాన్ని నేరంగా చూసే వలసవాద చట్టాల వారసత్వాన్ని విడిచిపెట్టి, సామాజిక న్యాయం అందించే ప్రదేశాలుగా ఈ హెూమ్‌లను మార్చాలని సూచించింది.

# మంత్రి నారా లోకేశ్ పుత్రోత్సాహం...

**లండన్ లో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారం అందుకున్న దేవాన్ష్**

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ (10) అంతర్జాతీయ వేదికపై అరుదైన ఘనత సాధించాడు. చదరంగంలో అద్భుత ప్రతిభ కనబరిచి నెలకొల్పిన ప్రపంచ రికార్డుకు గాను, లండన్‌లోని చారిత్రాత్మక వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి మంత్రి నారా లోకేశ్ స్వయంగా హాజరై, కుమారుడి విజయాన్ని చూసి మురిసిపోయారు.
వివరాల్లోకి వెళితే, గత ఏడాది జరిగిన 'చెక్ మేట్ మారథాన్' పోటీలో దేవాన్ష్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. ప్రఖ్యాత చెస్ గ్రాండ్‌మాస్టర్ లాస్లో పోల్గార్ రచించిన "5334 ప్రాబ్లమ్స్, కాంబినేషన్స్, అండ్ గేమ్స్" పుస్తకం నుంచి తీసుకున్న 175 క్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను అత్యంత వేగంగా పరిష్కరించి 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. సులభం నుంచి అత్యంత కఠినంగా మారే ఈ పజిల్స్‌ను పరిమిత సమయంలో పరిష్కరించడం ద్వారా దేవాన్ష్ తన వేగాన్ని, మేధాశక్తిని ప్రపంచానికి చాటాడు.ఈ అద్భుతమైన రికార్డును గుర్తించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ, తాజాగా దేవాన్ష్‌ను పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం నిజంగా చాలా ప్రత్యేకమైన సందర్భం. పదేళ్ల వయసులోనే ముందుచూపుతో ఆలోచించడం, ఒత్తిడిలో ప్రశాంతంగా ఉండటం, ఆట పట్ల పూర్తి అంకితభావంతో ఉండటం అతని విజయాన్ని మరింత ప్రత్యేకం చేశాయి. ఒక తండ్రిగా, అతను గంటల తరబడి చేసిన సాధనను నేను కళ్లారా చూశాను. అతని కష్టానికి దక్కిన నిజమైన ప్రతిఫలం ఈ గుర్తింపు. మేమందరం అతని గురించి చాలా గర్వపడుతున్నాం" అని తెలిపారు.తల్లిదండ్రులు నారా బ్రాహ్మణి, నారా లోకేశ్ ల ప్రోత్సాహం, కోచ్ కె. రాజశేఖర్ రెడ్డి మార్గదర్శకత్వంలో దేవాన్ష్ నెలల తరబడి ఏకాగ్రతతో సాధన చేసి ఈ ఘనతను సాధించాడు. ఈ రికార్డుతో పాటు, గతంలో మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా దేవాన్ష్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఏడు డిస్కుల 'టవర్ ఆఫ్ హనోయి' పజిల్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, అలాగే 9 చెస్ బోర్డులను 32 పావులతో కేవలం 5 నిమిషాల్లో సరిగ్గా అమర్చడం ద్వారా కూడా రికార్డులు నెలకొల్పాడు. దేవాన్ష్ విజయం అతని కుటుంబానికే కాకుండా, ప్రపంచ చెస్ రంగంలో ఎదుగుతున్న భారత కీర్తికి నిదర్శనంగా నిలిచింది.

# 200 రోజులు గడిచినా మృతదేహాలువెలికితీయరా?..

**(మొదటి పేజి తరువాయి)**
"అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం 200 రోజులు గడిచినా ఆరుగురు బాధితుల మృతదేహాలను కూడా వెలికితీయలేకపోయింది. వారి కుటుంబాలకు ఇంతవరకు ఎలాంటి నష్టపరిహారం అందించలేదు" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపైనా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న సమస్యలకే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపి హడావుడి చేసిన బీజేపీ.. ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎందుకు స్పందించడం లేదు? ఎందుకు ఎలాంటి దర్యాప్తు బృందాన్ని పంపలేదు? తెలంగాణలో కాంగ్రెస్ (ఛోటే భాయ్)ను బీజేపీ (బడే భాయ్) ఎందుకు కాపాడుతోంది? వీరి మధ్య ఉన్న ఈ అపవిత్ర బంధం ఏమిటి?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.
తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు న్యాయం చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. "మేం అధికారంలోకి వచ్చిన రోజున ఆ ఆరు కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం. ఆరుగురు కార్మికులను సజీవ సమాధి చేసిన వారు తగిన మూల్యం చెల్లించుకునేలా చేస్తాం. కాంగ్రెస్ నాశనం చేసిన ప్రతిదానికీ సమాధానాలు రాబడతాం" అని స్పష్టం చేశారు.
ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పులోని కొంత భాగం కూలిపోవడంతో 8 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగినప్పుడు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) సహాయంతో దాదాపు 50 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన 14 కిలోమీటర్ల లోపల ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గాలింపు చర్యల అనంతరం పంజాబ్‌కు చెందిన టీబీఎం ఆపరేటర్ గుర్ ప్రీత్ సింగ్ మృతదేహాన్ని మార్చి 9న, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్ట్ మేనేజర్ మనోజ్ కుమార్ మృతదేహాన్ని మార్చి 25న వెలికితీశారు. కాగా, శ్రీనివాస్ (ఉత్తర ప్రదేశ్), సన్నీ సింగ్ (జమ్మూ కాశ్మీర్) సహా జార?ండ్‌కు చెందిన సందీప్ సాహు, జెగ్తా జెస్, సంతోష్ సాహు, అనూజ్ సాహు మృతదేహాలు ఇంకా లభ్యం కాలేదు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం15 సెప్టెంబర్ 2025

# నిలోఫర్,ఎంఎన్‌జే ఆసుపత్రుల వద్ద 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ అన్నదానం



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):సెప్టెంబర్ 14** స్వచ్ఛంద సంస్థ 'రెడీ టూ సర్వ్'ఫౌండేషన్ ఆదివారం లక్డీకపూల్‌లోని నిలోఫర్,ఎంఎన్‌జే ఆసుపత్రుల వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆసుపత్రులకు వచ్చే రోగులు,బంధువులు, పేదలకు ఉచితంగా భోజనం అందజేసింది.ప్రతి ఆదివారం ఆకలితో బాధపడుతున్న వందలాది పేదల పూట భోజనానికి తోడ్పడాలనే సంకల్పంతో సంస్థ నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని సంస్థ నిర్వాహకుడు పెద్ది శంకర్ తెలిపారు. ప్రతి వారం మా సేవ కార్యక్రమాలు సమాజానికి చేరువవుతున్నాయని ఆకలిని తీర్చడం మా ప్రధాన లక్ష్యం అని ఆయన అన్నారు.ఈ అన్నదానం కార్యక్రమంలో శివ చైతన్య,బి.టి. నాయుడు విజయభాస్కర్, నాగమోహన్,సతీష్ గౌడ్,చంద్రశేఖర్,డైసీ రిత్విక,చంద్ర,సైదులు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మేధా హై స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి..

## ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలి..

## బిజెపి నాయకురాలు ఎం.రాజేశ్వరి..



**ప్రజావినికిడి,(మెట్టుగూడా):** సికింద్రాబాద్ లో పగలంతా తరగతులు నిర్వహిస్తూ రాత్రంతా మత్తు పదార్థాలు తయారు చేస్తున్న మేధా హై స్కూల్ గుర్తింపును వెంటనే రద్దుచేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకొని తెలంగాణ యువత జీవితాలను కాపాడాలని బిజెపి ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి డిమాండ్ చేశారు. హైదరాబాదులో ఇటీవలే 12 కోట్ల డ్రగ్స్ పట్టుబడ్డాయని అది మర్చిపోకముందే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన తరగతి గదుల్లో మత్తు పదార్థాలు తయారు చేయడం క్షమించాలని చర్య అని విద్యాశాఖ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇట్టి సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని రాజేశ్వరి డిమాండ్ చేశారు. 2023లో అధికారంలోకి రాకముందు మొట్టమొదటి సంతకం బెల్ట్ షాపులపైనే అని బీరాలు పలికిన ముఖ్యమంత్రి ఇప్పుడు మద్యం ద్వారా వచ్చే ఆదాయంతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపాలని చూస్తున్నారని అన్నారు.తెలంగాణ యువత బతుకు చిత్తు కాకూడదంటే మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపాలని మద్యాన్ని ఆదాయాన్ని మార్గంగా మాత్రమే చూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కరుణశ్రీ పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17న చరిత్రను బిజెపి వక్రీకరిస్తే నిజంతో నీడలా వెంటాడుతాం..

## ఈటీ నరసింహ..- సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి.

## రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు -ఎం.డి పైమీద..





**ప్రజావినికిడి,(నాగోల్):**తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందాం సభ సాయి నగర్ (నాగోల్) లో కామ్రేడ్ సైదా బేగం,పాషా ల అధ్యక్షతన ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈటి నరసింహ మాట్లాడుతూ,నిజాం రచయిత పాలన అంతమందించాలని భూస్వామ్య వ్యవస్థ చేస్తున్న ఆగడాలను ఎదురిస్తూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మహోత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటం జరిగింది.10 లక్షల ఎకరాలు భూమినీ పేదలకు పంపిణీ చేయడం జరిగింది. 3000 గ్రామాలు విముక్తి అయినవి. వెట్టిచాకిరి వ్యవస్థ రద్దు చేయడం జరిగింది. కౌలు రైతులకు భూములపై హక్కు కల్పించటం జరిగింది.ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు తమ రక్త తర్పణ ద్వారా ఈ నేలను ఎరుపు ఎక్కించారు.అతి సాధారణ మనుషులు బంధువులు చేతబట్టి పోరు నడిపిన చరిత్ర ప్రపంచ ప సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గది.
ఇలాంటి చరిత్ర పైన బిజెపి ఇది ముస్లిం పైన హిందువులు సాధించిన విజయం గా అభివర్ణిస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే నిజాలతో నీడలా వెంటాడుతూ, అనునిత్యం ప్రజలను చైతన్యం చేసి మీ అబద్ధాలకి సమాధి కడతామని అన్నారు.
తెలంగాణ సాయుధ పోరాటంలో త్యాగాలు చేసిన వీరులను గౌరవించకుండా పెన్షన్లను నిరాకరించిన దుర్మార్గమైన చరిత్ర కలిగిన బిజెపి ఇవ్వాలా సెప్టెంబర్ 17 గురించి మాట్లాడటం హాస్యాస్పదం..
ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పైమీద, సాయినగర్ శాఖ కార్యదర్శులు నాయకులు మహేందర్,శ్రీనివాస్, కె.రాము,డి.రాము, వెంకటేష్ యాదయ్య, విజయ్ పాస్టర్ ధనమ్మ లక్ష్మి,కమ్లి,పద్మ,ప్రమీల షమీం,లావణ్య బాలమణి,అనిత, వెంకటమ్మ కుమారి అనిత తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సంఘటితం ఐతేనే మనుగడ

## దేశంలో నిజాయితీ రాజకీయాలు రైతులతోనే - 25 మంది రైతులకు ఆత్మీయ సత్కారం

## యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో నిర్వహణ

## హజరైనా సిబిఐ మాజీ జెడి లక్ష్మినారాయణ,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు,సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
రైతును బ్రతికించాలి.. రైతును కాపాడాలి.. రైతుకు అండగా ఉండాలనే నినాదంతో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ చేస్తున్న వినూత్న కార్యక్రమాలలో భాగంగా సెప్టెంబర్ 14 అదివారం అన్నదాతకు ఆత్మీయ సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అధ్యక్షత వహించగా సిబిఐ మాజీ జెడి లక్ష్మినారాయణ,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు,సినీ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్,మాజీ అగ్రికల్చర్ ఆఫీసర్ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.రైతులు సంఘటితం అవ్వాలి. రాజకీయాలు గ్రామాల్లోకి వెళ్లాయి.ఒకప్పుడు గ్రామాల్లో పంటలు, వ్యవసాయం గురించి మాట్లాడేవారు.కాని ఇప్పుడు నలుగురు కలిస్తే రాజకీయం గురించి మాట్లాడుతున్నారు. గ్రామాల్లో పంట పండించిన వారు వారే ఒక కంపెనీ పెట్టి డైరెక్ట్ అమ్మాలి.మీరంతా రాజకీయాలు మార్చాలి.నిజాయితీ రాజకీయాలకు రైతులే పునాది వేయాలి.ప్రభుత్వం రైతు విలువ పెంచాలి.స్వతంత్ర్యం దినోత్సవం రైతులచే జెండా ఎగరవేయాలి. టోల్ గేట్ దగ్గర రైతులకు ఉచితం అని పెట్టాలి. ప్రపంచంలో ఎన్ని టెక్నాలజీలు వచ్చినా రైతు లేనిదే మనం తినలేం.డ్వాక్రా గ్రూపులతో రసాయనాలు,కషాయాలు చేపించాలి.రైతు గురించి అందరూ గొప్పలే వారు కాని,వారి ఉన్నతి కోసం పాటుపడేవారు కరువయ్యారని అన్నారు. కుంటలు, చెరువులు కబ్జా కాకుండా ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. మనం తినే ఆహారం కల్తీకాకుండా ఉండాలంటే రైతులకు,ప్రోత్సాహం అందించాలన్నారు. రైతు లేకపోతే సమాజం లేదు. మీరు కష్టపడితే మేము తింటున్నాం.భూమాతకు సేవ చేస్తున్న మీ అందరికి ఎప్పటికి రుణపడి ఉంటాం.ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలలో 25మంది రైతులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో డా. స్రవంతి,పబ్బ శరణ్య,కొమటి రమేశ్ బాబు,కొన్నె దేవేందర్, బత్తిని రాజేశ్,గీతానంద్,రాగి స్వప్న,గంగాధర్,నాగేంద్ర, వంశీకృష్ణ,రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ కు వన్నెతెచ్చిన నాయకుడు,

## తెలంగాణ ముద్దుబిడ్డ బూర్గుల రామకృష్ణ రావు..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

### బూర్గుల రామకృష్ణ రావు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి.. - పాల్గొన్న కాంగ్రెస్ నేతలు,జేఏసీ నాయకులు.

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
స్వాతంత్ర ఉద్యమకారుడుగా,కవిగా,తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు పాత్ర ప్రశంసనీయమైనదని,బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన జీవితాన్ని ఆదర్శవంతంగా మలుచుకున్నారని వీర్లపల్లి శంకర్ ప్రశంసించారు. బూర్గుల రామకృష్ణ రావు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మారుమూల గ్రామమైన బూర్గులలో జన్మించి కవిగా,సమరయోధుడిగా, నాయకుడిగా,న్యాయవాదిగా భిన్న పాత్రలు పోషించిన బూర్గుల దేశానికే వన్నె తీసుకువచ్చారని ప్రశంసించారు.14 భాషలలో అనర్గళంగా మాట్లాడగల సామర్థ్యం ఆయన సొంతమని అన్నారు.రక్షిత కౌలుదారు చట్టం ద్వారా నిరుపేదలకు భూములు ఇచ్చి ఆదుకున్న



మహనీయుడు అన్నారు.తెలుగు రాష్ట్రాలను ఒకటి చేయడం కోసం తన ముఖ్యమంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన గొప్ప మనసు ఆయనదని అభినందించారు.షాద్ నగర్ నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి అయిన బుర్గుల పనిచేసిన ఈ నియోజకవర్గంలో తాను ఈరోజు ఎమ్మెల్యేగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.ఆయన చేసిన భూసంస్కరణలు దేశానికే ఆదర్శవంతంగా మారాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు అగ్గనూరు బస్వం,చెంది తిరుపతిరెడ్డి, రాజు, బాలరాజు గౌడ్, మురళీమోహన్ (అప్పి), మాధవులు, ఆంజనేయులు ,శేఖర్,పెంటయ్య, అంజి యాదవ్, గోపాల్ నాయక్,శీను నాయక్,అర్జున్, లక్ష్మణ్, తుపాకుల శేఖర్,మాణిక్యం, సీతారాములు, సుదర్శన్,భాస్కర్ గౌడ్, రమేష్,టీజేఏసీ నేతలు జనార్ధన్,టీజీ శ్రీనివాస్,వీరేశం, కరుణాకర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు : సిఐ సైదిరెడ్డి



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** నేరాల నివారణకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని సరూర్ నగర్ సిఐ సైదిరెడ్డి అన్నారు. ఆదివారం సరూర్నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ రోడ్డు నంబర్ 5లోని మూడవ లైన్ కాలనీ వాసులు నూతనంగా ఏర్పాటు సీసీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ తో కలిసి సిఐ సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు అని ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని,నేరాలు అదుపు చేయడానికి పోలీసులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సీసీ కెమెరాలు పెట్టడం ముఖ్యమే కానీ అవి పని చేసే విధంగా ప్రతిరోజు మానిటర్ చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కాలనీ వాసులను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దానం రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రావు,కాలనీ ప్రతినిధులు సోమ వెంకట్,తులసీ కృష్ణమూర్తి,రాజనాల వెంకటేశ్వర్ రావు, గంటి శంకర్,గుంత ప్రవీణ్,గంటి వెంకట్ రావు,గంటి శంకర్. కె. బుద్ధోజి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# హైదరాబాద్ విమోచన దినోత్సవ ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభం

**ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ**





**ప్రజావినికిడి,(హైదరాబాద్):** విమోచన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఛాయాచిత్ర ప్రదర్శన (ఫోటో ఎగ్జిబిషన్) ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రదర్శనలో నిజాం రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన పోరాట వీరుల చరిత్రను ప్రతిబింబించే అరుదైన ఫోటోలు,పత్రాలు, సంఘటనల చిత్రాలు ప్రదర్శించబడ్డాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,ఎంపీ ఈటెల రాజేందర్,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రాంచందర్ రావు,ఎమ్మెల్సీ సి.అంజి రెడ్డి,ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా విమోచన దినోత్సవ కమిటీ కన్వీనర్,బీజేపీ నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన పోరాట వీరుల త్యాగమే ఈ రోజున మన స్వేచ్ఛకు పునాది.యువత ఈ చరిత్రను తెలుసుకుని,దేశభక్తిని వారసత్వంగా కొనసాగించాలి అని అన్నారు.

## నార్సింగి మున్సిపాలిటీ ముఖ్య నాయకుల సమావేశం..



**ప్రజావినికిడి,(రాజేంద్రనగర్): సెప్టెంబర్ 14,**కోకాపేట కమ్యూనిటీ హాల్ లో నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షులు మెండే నాగేష్ ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేసి సుమారు 75 యూనిట్ల బ్లడ్ డొనేషన్ చేయాలి, 17 సెప్టెంబర్ తెలంగాణ విమోచనదినని పార్టీ ఆధ్వర్యంలో జెండా ఎగరావేసే కార్యక్రమం నిర్వహించాలి, అక్టోబర్ 2 గాంధీ జయంతి,లాల్ బహదుర్ శాస్త్రి జన్మదినం వరకు సేవకార్యక్రమాలు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా రాష్ట్ర నాయకులు దుద్దాల లక్ష్మినారాయణ, మెండే నాగేష్,సి. హెచ్.బిక్షపతి,జి. శివరాజ్,కె ప్రభాకర్,డి నాగేష్, బ్రాహ్మచారి అరవింద్,కె సురేష్, జైదీప్,మంగా,రాజు, కిరణ్ కుమార్, మాస్కురి వెంకటేష్, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ భూపతి సురేష్ సంతాప సభ



**ప్రజావినికిడి,(నాగోల్):** ఆదివారం రోజు ఉదయం జైపురి కాలనీలో సి ఆర్ కమ్యూనిటీ హాల్ యందుకామ్రేడ్ భూపతి సురేష్ సంతాప సభకర్యక్రమం సిపిఐ నాగోల్ జైపురి కాలనీ శాఖల1%e%2 ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది,ఈ యొక్క కార్యక్రమానికి బొడ్డుపల్లి కృష్ణ సిపిఐ సీనియర్ నాయకులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సయ్యద అజీజ్ పాషా మాజీ రాజ్యసభ సభ్యులు సిపిఐ జాతీయ కార్యదర్శి జైపూర్ కాలనీ వ్యవస్థాపకులుభారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తున్న బొడ్డుపల్లి కృష్ణ భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు రవి నారాయణ శేఖర్ రెడ్డి రవీంద్ర చారి బొడ్డుపల్లి చుక్కయ్య పి.ఎస్సార్ గంగాధర్ రాజ మల్లయ్య అశోక్ అమూర్తమ్మ పి.శంకర్ సంపత్ బాలమ్మ కే ఎల్లయ్య బి అఖిల్ పి అమరేశ్వర్ శ్యామల పద్మ బాలమ్మ పాల్గొన్నారు, మొదటగా కామ్రేడ సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా అజీష్. ఫాష మాట్లాడుతూ, అతి చిన్న వయసులో సురేష్ మరణం బాధాకరమన్నారు. వారు మరణం వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేసి కుటుంబానికి కాదు,పార్టీకి కూడా తీరని లోటు అన్నారు, జైపూర్ కాలనీలో 1984.పట్టాల పంపిణీ నుండి శాశ్వత ఇండ్ల నిర్మాణం పథకం చేపట్టి పార్టీ ఇచ్చే అనేక పోరాటాలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ దృఢమైన కార్యకర్తగా అంచలంచలుగా పార్టీ శాఖ కార్యదర్శిగా మండల నాయకులుగా ఎదిగారన్నారు.పార్టీ ఒక చురుకైన యువ నాయకుడిని కోల్పోవడం ఎంతో నష్టం అన్నారు.స్థానిక ప్రజల సమస్యలపై అనేక సంక్షేమ కార్యక్రమాలపై సామాజిక కార్యక్రమాలపై పార్టీ ఇచ్చిన అనేక కార్యక్రమాలను తూచా తప్పకుండా పాటిస్తూ చురుకుగా పనిచేసేవాడని గుర్తు చేశారు,సురేష్ ఆలోచనలను ఆశయాలను కొనసాగించుటకు వారి కుటుంబ సభ్యులు స్థానిక యువతరం ముందుకు రావాలని కోరారు అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తగా నాయకుడిగా పార్టీ సభ్యుడిగా పార్టీలో నాయకత్వ స్థాయికి ఎదిగి ఎన్నో లోటు పాటలను ఎదుర్కొంటూ ఎన్నో కేసులను ఎన్నో సమస్యలను ప్రజల యొక్క సమస్యలు తన సమస్యలుగా భావించి నిరంతరం ప్రజా జీవితంలో మెలిగిన నాయకుడని 24 గంటలు పార్టీ కాలనీ ప్రజలు కాలనీ సమస్యల మీద ఎంతవరకైనా తెగించి ముందుకు నిలబడే వాడని అలాంటి వారిని కోల్పోవడం పార్టీకి తీవ్ర నష్టమని చెప్పారు పార్టీలో చేరినప్పటి నుంచి చివరి శ్వాస వరకు ఎత్తిన పార్టీ జెండాను దించలేదని అలాంటి నాయకులు దొరకడం చాలా అరుదు అన్నారు. దాదాపు 32 సంవత్సరాలుగా పార్టీని ప్రజలను అట్టిపెట్టుకొని తన సమస్యలను కూడా పక్కనపెట్టి ప్రజా సమస్యల గురించి ఇండ్ల పట్టాలు గాని ఇండ్ల కేటాయింపులు గాని రేషన్ కార్డులు గాని వివిధ రకాలైన లోన్లు,ఇంటి నంబర్లు, రోడ్లు వీధి దీపాలు డ్రైనేజీ విద్యుత్తు ఇలా అనేక ప్రజా సమస్యల మీద ముందుండే పని చేసినటువంటి నాయకుడు సురేష్ ని కొనియాడారు.ఈ యొక్క కార్యక్రమంలో జైపూరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యామల యాదగిరి బిఆర్ఎస్ పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి గోల్కొండ మైసయ్య మాజీ సర్పంచ్.సిపిఐ. శాఖ కార్యదర్శి షబిర్యాలీ బ్లైండ్స్ కాలనీ శాఖ కార్యదర్శి రాములు జై పూరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులుకాలనీవాసులు వివిధ పార్టీల నాయకులు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

### రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం ఎమ్మార్వో కార్యాలయాల

# ముట్టడిలను విజయవంతం చేయాలి

ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడిలు దద్దరిల్లాలి

ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ.



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్రంలో పెన్షన్ పెంచాలి అర్హులైన ప్రతిఒక్కరికి పెన్షన్ మంజూరి చేయాలని డిమాండ్ చేస్తూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేపు అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాలను ముట్టడించబోతున్నామని,వందలాది మంది పెన్షన్ దారులతో నిర్వహించే ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడిలు దద్దరిల్లాలనీ ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ అన్నారు.షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ విభాగాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ,మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ పెంచి ఇస్తామని గొప్పలు చెప్పి నేడు అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా,పెన్షన్ పై ఇచ్చిన హామీని నెరవేర్చకుండా పేదవర్గాలని ద్రోహం చేశాడని మండిపడ్డారు.మెజార్టీగా పెన్షన్ దారులు పేదవారే అని,ఇచ్చిన మాటను అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి కి పరిపాలించే అర్హత లేదని మండిపడ్డారు.పెన్షన్ పెంచకుండా ఏడు సంవత్సరాల నుంచి కొత్త పెన్షన్లు మంజూరు.చేయకుండా ప్రభుత్వం చేస్తున్న మోసానికి నిరసనగా పోరాటాల ద్వారానే ప్రభుత్వ మీద ఒత్తిడి పెంచేందుకు మందకృష్ణ మాది నాయకత్వంలో పెన్షన్ దారులను ఏకం చేసి మానవీయ పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సభలు సమావేశాలతో చుట్టూ ముట్టి కలెక్టరేట్ కార్యాలయాలను వేలాది మందితో దిగ్బందించామని,రేపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్వో కార్యాలయంలను ముట్టడి చేస్తామని,ఈ ముట్టడిల విజయవంతం కోసం పెన్షన్ దారులు అలాగే ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల శ్రేణులు శ్రమించాలి అని నరసింహ మాదిగ పిలుపునిచ్చారు.

# క్రిడలతోనే మానసిక ప్రశాంతత,ఆరోగ్యం

## యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి

**స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ - క్రీడాకారులకు 1లక్ష 50 వేల క్రికెట్ కిట్లు,బూట్లు,సామాగ్రి అందజేత**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని మినీ స్టేడియంలో ఆదివారం దాత అంజన్ గౌడ్ 1 లక్ష 50 వేల క్రీడా సామాగ్రినీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా క్రీడాకారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,నేటి సమాజం లో పిల్లలు,యువత మొబైల్ ఫోన్లకు అలవాటు పడ్డారని దానివల్ల ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారని దీనిపై పిల్లల తల్లితండ్రులు ద్రుష్టి సారించి పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాలని కోరారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం,శరీర దారుడ్యాం పెరుగుతుందని తెలిపారు. క్రీడాకారులకు తనవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా క్రీడా సామాగ్రి దాత అంజన్ గౌడ్ ను అభినందించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య,తిరుపతి రెడ్డి,అగ్గనూరు బస్వం,మురళి (అప్పి),ఖదిర్,బచ్చలి నరేష్,షాద్ నగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రవితేజ,కబీర్ అహ్మద్, మహమూద్, మతిన్,మున్నా, శివకుమార్, శివాజీ,మధుసూదన్ గౌడ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయిధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు..

**రైతు సంఘం జాతీయ పూర్వపు ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులేనని రైతు సంఘం జాతీయ పూర్వపు ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు ఆదివారం నాడు షాద్ నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్ లో టిఎస్ యూటిఎఫ్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమం యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు గౌడ్ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా రైతు సంఘం జాతీయ పూర్వపు ఉపాధ్యక్షులు సారాంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ, హైదరాబాదు సంస్థానంలోని తెలంగాణ ప్రాంతం ఆనాడు నిజాం సైన్యం అండతో గ్రామాలలోని జాగిర్దారులు జమీందారులు దేశముక్ లు, భూస్వాములు ప్రజలపై తీవ్రమైన అణచివేతకు గురి చేస్తూ ఉండేవారని ఆనాడు అంటారనితనం కులవివక్ష మహిళలపై అత్యాచారాలు దాడులు నిత్య కృత్యం జరిగేటివని ప్రజలంతా శ్రమ దోపిడీకి గురై ఆకలితో అలమటించేవారని ఇలాంటి అనచీవేతలు దాడులు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజలంతా కుల మతాలకతీతంగా ఏకమై కమ్యూనిస్టుల నాయకత్వంలో నిజాం సైన్యమైన రాజాకర్లకు గ్రామాలలోని పెత్తందారులకు వ్యతిరేకంగా 1946 నుండి 1948 సెప్టెంబర్ 17 వరకు భారత్ లో విలీనం అయ్యేవరకు ఉద్యమం కొనసాగిందని ఈ కాలంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ నిజాంకు సంబంధించిన సర్ఫే ఖాజ్ భూములు జాగిర్దారుల జమీందారుల భూస్వాములు అధీనంలోని 10 లక్షల ఎకరాల భూములను ఆక్రమించి ప్రజలకు పంచడం జరిగిందని అలాగే 3000 గ్రామాలలో సోషలిస్టు పాలన విధానాన్ని అమలు చేశారని తెలంగాణ భారత్ లో విలీనమైన తర్వాత పోరాటం ద్వారా సాధించుకున్న ఫలాలను అనుభవించడానికి హక్కుగా పొందడానికి అదే పోరాటాన్ని 1951లో రక్షితకౌలు దారి చట్టం వచ్చేదాకా కొనసాగించడం జరిగిందని ఈ చట్టం ద్వారా దున్నే వాడికి భూమి నినాదం సాధించడం జరిగిందని ఈ పోరాటం రెండు మతాల మధ్య జరిగింది కాదని రెండు వర్గాల మధ్య దోపిడిదారులు దోపిడీకి గురైన వారి మధ్య జరిగింది గా గుర్తించాలని వాస్తవ చరిత్రను ప్రజల ముందు ఉంచాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెంకటరమణ,రాజు శ్రీను నాయక్,జనార్దన్,సత్యం బాలయ్య,కృష్ణ,శ్రీకాంత్ లక్ష్మీదేవమ్మ,అరుణ,రాములు శివారెడ్డి ,వెంకటయ్య, రవికుమార్ వినీత్,నర్సింలు, రవీంద్రనాథ్, కురుమయ్య,కరుణాకర్,శ్రీనివాస్ రవీందర్ రెడ్డి.బాల్ రాజ్,కుర్మయ్య మహమ్మద్,బాబు,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి.. : ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..


బాధిత కుమారుడు మనీష్ కి 2,00,000 రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
కొత్తపేట డివిజన్ పరిధిలోని నాగేశ్వరరావు కాలనీ నందు నివాసం ఉండే భాస్కర్ రావు కడుపులో గడ్డలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో భారస నాయకులు ప్రతిక్,సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గుల్బర్గా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు..

**కాంగ్రెస్ నేత మహమ్మద్ ఇబ్రహీం..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
షాద్ నగర్ కాంగ్రెస్ నేతలు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోని హాజ్రాత్ ఖజా బందే నవాజ్ దర్గాలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ మహమ్మద్ ఇబ్రహీం ఇసాక్ ప్రత్యేక పూజలు చేశారు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ మహమ్మద్ ఇబ్రహీం కాజా ఇసాక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని వేడుకున్నారు.షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు రైతులు సుఖంగా జీవించాలని దర్గాలో ప్రత్యేక ప్రార్థన చేశారు.

# రాజగోపాల్ రెడ్డి అంశం మల్లు రవి షాకింగ్ కామెంట్స్

**హైదరాబాద్, సెప్టెంబరు14 :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పందించారు. రాజగోపాల్ రెడ్డిపై ఫిర్యాదు వస్తే చర్చిస్తానని చెప్పుకొచ్చారు. రాజగోపాల్ రెడ్డిపై ఎవరో ఇంట్రెస్ట్ చూపిస్తే కమిటీ చర్చించదని స్పష్టం చేశారు. (ఆదివారం) గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా మల్లు రవి మీడియాతో మాట్లాడారు.అలాగే, సిద్ధిపేట డీసీసీ నర్సారెడ్డిపై గజ్వేల్ దళితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంపై నర్సారెడ్డిని వివరణ ఇవ్వాలని కోరామని పేర్కొన్నారు. పూజల హరికృష్ణపై ఫిర్యాదు వస్తే వివరణ అడిగామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో చేరికలను ఆహ్వానించామని తెలిపారు. ఇంట్రెస్ట్ ఉన్న నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. మీడియా ముందు అంతర్గత విషయాలు మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు మల్లు రవి.మాజీ మంత్రి కేటీఆర్ తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డారని విమర్శించారు. కేటీఆర్ రాజకీయ నాయకుడు అయితే తాము సన్యాసులమా? అని ఫైర్ అయ్యారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్‌లో చేర్చుకున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించారా అని ప్రశ్నించారు. గత పదేళ్లు ఏం చేశారో కేటీఆర్ చూసుకోని తమను ప్రశ్నించాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు పార్టీ మారలేదంటే కేటీఆర్‌కు అంత ఇబ్బంది ఎందుకని మల్లు రవి నిలదీశారు.



# యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్ జిల్లా :** కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. నెలల తరబడి కేంద్రాల చుట్టూ తిరిగినప్పటికీ ఒక్క బస్తా కూడా దొరకడం లేదు. దీంతో యూరియా ఇస్తారనే సమాచారం తెలిసిన వెంటనే కేంద్రాలకు వెళ్లి అర్ధరాత్రి నుంచే పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు కూడా యూరియా తిప్పలు తప్పలేదు. ఆమె కూడా యూరియా కోసం క్యూలైన్‌లో గంటల తరబడి వేచివున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండాలో సత్యవతి రాథోడ్‌కు ఐదున్నర ఎకరాల భూమి ఉంది. దానికోసం యూరియా బస్తాల కోసం ఆమె గుండ్రాతిమడుగు రైతు వేదిక వద్దకు ఆదివారం నాడు వచ్చారు. యూరియా బస్తాల కోసం క్యూలైన్‌లో నిల్చున్నారు. తీరా ఆమె లైన్ వచ్చేసరికి ఒక్క బస్తా మాత్రమే అధికారులు ఇచ్చారు. దీనిపై మంత్రి సత్యవతి రాథోడ్ అసహనం వ్యక్తం చేశారు. ఐదున్నర ఎకరాల భూమికి ఒక్క బస్తా మాత్రమే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు.



# ఆమెలా పూటకో పార్టీ మారితే 5సార్లు ఎమ్మెల్యే అయ్యేవాడిని
# మంత్రి కొండా సురేఖపై నాయిని ధ్వజం

**వరంగల్ జిల్లా** కాంగ్రెస్‌లో రాజకీయ విభేదాలు భగ్గుమంటున్నాయి. మంత్రి కొండా సురేఖ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మధ్య మొదలైన మాటల యుద్ధం రోజురోజుకీ ముదురుతోంది. అదృష్టం కొద్దీ నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కొండా సురేఖలా పూటకో పార్టీ మారితే నేను కూడా ఐదు సార్లు ఎమ్మెల్యే అయ్యేవాడినని సెటైర్లు వేశారు. ఈ మేరకు ఒక వీడియోను రిలీజ్ చేశారు.మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మధ్య భద్రకాళి ఆలయ పాలకమండలి కమిటీ చిచ్చు రేపింది. ఈ నేపథ్యంలో కొండా సురేఖ వ్యవహార శైలిపై నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. తాము ఏది చేసినా నడుస్తోందని కొండా సురేఖ అనుకుంటున్నారని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా భద్రకాళి ఆలయ పాలకమండలిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. దేవాదాయ శాఖకు మంత్రి అయినంత మాత్రాన ఏదైనా చేయొచ్చా అని నిలదీశారు. అయినా నా నియోజకవర్గంలో ఆమె పెత్తనమేంటని అని ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖ ఇదే పద్ధతి అవలంబిస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. అంతా మంత్రి చేశాక స్థానికంగా తాను ఉన్నది దేనికని, తన ఓపికకు పరీక్ష పెట్టవద్దని హెచ్చరించారు. ఈ విషయంలో కొండా సురేఖపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.నాయిని వ్యాఖ్యలపై కొండా సురేఖ కూడా అంతే ఘాటుగా స్పందించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాయిని రాజేందర్ రెడ్డి అదృష్టం కొద్దీ ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. నాయిని రాజేందర్ రెడ్డిపై తాను వ్యాఖ్యలు చేయదలచుకోలేదని వ్యాఖ్యానించారు. అయినా తనకన్నా ముందు ఎమ్మెల్యే కావాలనుకున్న వ్యక్తి ఇప్పుడు అయ్యాడని విమర్శించారు. దేవాదాయ శాఖ మంత్రి హోదాలో గుడిలో ఇద్దరు ధర్మకర్తలను భర్తీ చేసే స్వేచ్ఛ తనకు లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆ భర్తీ చేసిన పోస్టులు కూడా అధిష్ఠానం పంపించిన పేర్లే అని ఆమె వివరించారు. నాయిని రాజేందర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నాయిని మరోసారి కొండా సురేఖపై తీవ్ర విమర్శలు గుప్పించా రు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది.



# బీఆర్ఎస్ సీనియర్ నేత కర్ర శ్రీహరి మరణం పట్ల కేసీఆర్ సంతాపం



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా వారితో తనకున్న ఉద్యమ, రాజకీయ అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.గ్రామస్థాయి నుంచి రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగిన శ్రీహరి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు పార్టీ తరపున నిబద్ధతతో సేవ చేశారని కేసీఆర్ అన్నారు. వారి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన కర్ర శ్రీహరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు.

# గ్రూప్-1పై కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

**హైదారబాద్:** గ్రూప్–1 పరీక్షలపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఖండించారు. గ్రూప్–1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కేటీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పరీక్షలలో 563 అభ్యర్థుల దగ్గర 3 కోట్ల రూపాయల లెక్కన తీసుకొని ప్రభుత్వం వాళ్ళను ఎంపిక చేసిందని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని ఎంపీ చామల కీరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. తల్లిదండ్రుల, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లుతున్నామని పేర్కొన్నారు. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని, ఎట్టి పరిస్థితుల్లో కూడా అడ్డంకులు రావద్దన్న సదుద్దేశంతో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించామని గుర్తుచేశారు. 563 మంది పిల్లల తల్లిదండ్రులకు మూడు కోట్లు పెట్టే స్థోమత ఉంటుందా..? అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయని ప్రజలు బాధపడుతూ ఉండాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల మీద బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని పేర్కొన్నా రు.రాజకీయ దురుద్దేశంతో కేటీఆర్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని చామల ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కేటీఆర్‌కి.. గ్రూప్–1కు ఎంపికైన అభ్యర్థుల తల్లిదం డ్రులు మీడియా ముందుకు వచ్చి బుద్ధి చెప్పాలని అన్నారు. (శనివారం) కేటీఆర్ మాట్లాడిన మాటల్లో.. ప్రజలకు నిజం తెలియాలంటే 563 గ్రూపు–1 అభ్యర్థుల తల్లిదండ్రులు స్పందించాలని ఆయన కోరారు. (ఆదివారం) తాను మాట్లాడిన తర్వాత తక్షణమే మీరు ఎక్కడుంటే అక్కడ వీడియోలు చెయ్యాలని చామల పిలుపునిచ్చారు. మీ ఆర్థిక స్థోమతను వీడియోలో వివరించాలని అన్నారు. ఇది పార్టీ సమస్య కాదు మన బిడ్డల సమస్య అని స్పష్టం చేశారు. రోడ్డు మీదికి రావాలి.. ప్రెస్‌మీట్‌లు పెట్టాలని సూచించారు. లేని సమస్యను సృష్టిస్తున్న కేటీఆర్‌ను చెప్పు దెబ్బలు కొట్టాలని చామల ధ్వజమెత్తారు.



# సింగరేణిని రక్షించింది కేసీఆరే



**హైదరాబాద్ :** సింగరేణిని రక్షించింది కేసీఆరే అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. సింగరే ణి నిర్వీర్యం కావడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కారణమని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మిర్యాల రాజిరెడ్డి మీడ యాతో మాట్లాడారు.ప్రపంచ వ్యాప్తం గా 2050 వరకు థర్మల్ పవర్ వుండవ ద్దని కుట్ర పన్నారు. బొగ్గు బ్లాకులను ప్రయివే టీకరణ చేస్తున్నారు. కేసీఆర్ ను ఒప్పించి కొప్పుల ఈశ్వర్ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశా రు. సింగరేణి కార్మికులకు ఎక్స్ గ్రేషియా ఇప్పించింది కేసీఆర్ ప్రభుత్వం. సింగరేణిలో 40వేలమంది కార్మికులు ఉండటానికి కారణం కేసీఆర్. కేసీఆర్ సీఎం కాకపోతే సింగరేణిలో 25వేల మంది ఉద్యోగులు ఉండేవారు కాదు అని రాజి రెడ్డి పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీలో కార్మికసంఘాలకు గౌరవాధ్యక్షులుగా పనిచేసినవారు రాజీ నామా చేశారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం మీటింగ్ పెట్టుకుని కొప్పుల ఈశ్వర్‌ను ఎన్నుకున్నాం. కార్మిక చట్టాలకు అనుగుణంగా కొప్పుల ఈశ్వర్‌ను గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నాం. అంతకుముందు అనేకమంది తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి గౌరవాధ్యక్షులుగా పని చేశారు. సింగరేణికార్మికులకలాభాల్లో వాటా ప్రకటించకపోతే ప్రకటిస్తామురాజిరెడ్డి హెచ్చరించారు.

# సికింద్రాబాద్‌లోని మేధా హైస్కూల్‌పై విద్యాశాఖ కీలక నిర్ణయం.స్కూల్ లైసెన్స్ రద్దు

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో కలకలం రేపిన ఓల్డ్ బోయిన్‌పల్లి మేధా స్కూల్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మేధా పాఠశాల అనుమతులను తెలంగాణ విద్యాశాఖ రద్దు చేసింది. మేధా పాఠశాలలో గుట్టుచప్పుడు కాకుండా అల్ప్రా జోలం తయారీ చేస్తోన్న వైనం వెలుగు చూసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మేధా స్కూలుకు ఉన్న అనుమతులను తెలంగాణ విద్యాశాఖ రద్దు చేసింది. మేధా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా.. వారిని వేరే పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.వాహనదారులకు బిగ్ అలర్ట్.. బైక్‌ల నుంచి కార్ల వరకూ.. ఇకపై అవి తప్పనిసరి.బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మేధా పాఠశాలపై ఈగల్ టీం దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. స్కూల్‌లో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ తయారీ చేస్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈగల్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో స్కూల్‌లో ఆల్ఫాజోరం తయారు చేసే మెషీన్లను పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. మేధా పాఠశాలకు చెందిన పాత భవనంలో మత్తు పదార్థాల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ కేసులో కొంతమందిని అదుపులోకి తీసుకుని ఈ విషయమై విచారిస్తున్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి 7 కిలోల ఆల్ఫాజోరంతో పాటుగా 20 లక్షల రూపాయల నగదు, కల్లులో కలిపే ఓ పౌడర్‌ను ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది.ఈ వ్యవహారంలో మేధా స్కూల్ ప్రిన్సిపల్ కీలక సూత్రధారిగా భావిస్తున్నారు.డ్వాక్రా మహిళలకు తీపికబురు. రెండు శాతం రాయితీ.స్కూల్‌లో డ్రగ్స్ తయారీ.. హైదరాబాద్ నగరంలో భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీమరోవైపు రేపటి పౌరుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలలో మూడో కంటికి తెలియకుండా ఇలాంటి వ్యవహారం నడిపించటం పోలీసులతో పాటుగా స్థానికులను కూడా విస్మయపరుస్తోంది. తరగతులు నిర్వహిస్తూనే.. స్కూలు సిబ్బందికి, విద్యార్థులకు ఏ మాత్రం అనుమానం రాకుండా ఈ వ్యవహారం నడిపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాఠశాల భవనంలోని రెండు గదుల్లో ఈ డ్రగ్స్ తయారీ వ్యవహారం నడుస్తున్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. పగలు పాఠశాల నిర్వహణ సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా ఈ రెండు గదులకూ తాళం వేసేవారని.. స్కూలు ముగిసి, విద్యార్థులు, సిబ్బంది ఇంటికి వెళ్లిన తర్వాత సాయ ంత్రం నుంచి అల్ప్రాజోలం తయారు చేసేవారని భావిస్తున్నారు.




# 26 మంది ప్రాణాల కంటే డబ్బు విలువైనదా భారత్, పాక్ మ్యాచ్‌పై అసదుద్దీన్ ఆగ్రహం



**హైదరాబాద్:** ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో మరణించిన 26 మంది ప్రాణాల కంటే డబ్బు విలువైనదా? అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడటానికి భారత్ జట్టును అనుమతించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో జరిగిన ప్రాణ నష్టం కంటే ఆర్థిక లాభాలు ముఖ్యమా? అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 'అస్సాం ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, మిగతా వారందరికీ (బీజేపీ నేతలకు) నా ప్రశ్న ఏమంటే, పహల్గామ్‌లో 26 మంది పౌరులను మతం అడిగి కాల్చి చంపిన పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడకుండా తిరస్కరించే అధికారం మీకు లేదా?' అని నిలదీశారు.కాగా, పహల్గామ్ ఉగ్ర దాడిలో మరణించిన 26 మంది పౌరుల ప్రాణాల కంటే ఈ మ్యాచ్ ద్వారా సంపాదించిన డబ్బు విలువైనదా? అని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. 'ప్రధానమంత్రిని మేం అడుగుతున్నాం. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని, ఉగ్రవాదం, చర్చలు కలిసి జరుగవని మీరు చెప్పారు. ఒక క్రికెట్ మ్యాచ్ నుంచి బీసీసీఐకి ఎంత డబ్బు వస్తుంది. రూ. 2000 కోట్లా, రూ. 3000 కోట్లా? మన 26 మంది పౌరుల ప్రాణాల కంటే ఈ డబ్బు విలువ ఎక్కువా?' అని నిలదీశారు. 26 మంది బాధిత కుటుంబాల వెంట తాము నిన్న ఉన్నామని, రేపు కూడా ఉంటామని అన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమా
# సీఎం రేవంత్‌పై ఎమ్మెల్యే సబిత ఫైర్

**హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఫైర్ అయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కేటాయిస్తారా లేదా అని నిలదీశారు.ఒక వైపు డబ్బులు లేవంటూనే ఉస్మానియా విశ్వ విద్యాలయానికి వెళ్లి ఎన్ని నిధులు కావాలో చెప్పండి అన్న సీఎం గారు.. ఆ నిధులతో పాటు ఇప్పటి వరకు బకాయిపడ్డ రూ. 10 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయండి అని ఆమె డిమాండ్ చేశారు.ఈ నెల 15 నుండి వృత్తి విద్య కళాశాలలు, 16 నుండి డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ చేస్తామంటున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇంటర్ కళాశాలల పరిస్థితి కూడా అంతే.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక ప్రయివేట్ కళాశాలలు ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక, అద్దె ఇతర ఖర్చులకు నిధులు లేక మూత పడే స్థాయికి వచ్చాయి. హాజరు శాతం,ఉత్తీర్ణత అంటూ కొర్రిలు పెడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చింది. దాదాపు 20 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది.రాష్టానికి ఒక్క రూపాయి ఆదాయం రాని కరోనా సమయంలోనూ విద్యార్థులకు సంభంధించిన నిధులు ఆపలేదు. కేసీఆర్ మీద కోపంతో గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారు.. సరైన తిండి, వసతులు లేక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో పెద్ద ఎత్తున కళాశాలలు మూతపడుతున్నాయి. వేల కోట్ల కొత్త ప్రాజెక్టులు ప్రకటిస్తూనే ఉపాధ్యాయుల, ఉద్యోగుల టిఏ, డిఏలకు డబ్బులు లేవంటూన్నారు. ఇదెక్కడి న్యాయం సీఎం గారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల విదేశీ విద్యను సాకరం చేసే ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులు వెంటనే విడుదల చేయండి. ఇప్పటికైనా ఎస్సి, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి ముఖ్యమంత్రి గారు అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మహిళా సాధికారతపై ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు



**తిరుపతి, సెప్టెంబరు 14 :** మహిళలకు గౌరవం ఇవ్వడం భారతదేశ సంప్రదాయమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాఉద్ఘాటించారు. (ఆదివారం) తిరుపతిలో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఓం బిర్లా పాల్గొని మాట్లాడారు. మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ దేశం అభివృద్ధి చెందలేదని చెప్పుకొచ్చారు. మహిళల అభివృద్ధికి రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించిందని గుర్తు చేశారు. మహిళా సాధికారత ఒక్క రోజులో సాధ్యం కాదని స్పష్టం చేశారు. అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటేనే మహిళా సాధికారత సాధించగలమని ఓం బిర్లా పేర్కొన్నారు.

# జగన్‌కు అయ్యన్నపాత్రుడు చురకలు

**తిరుపతి, సెప్టెంబరు14 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికిఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చురకలు అంటించారు. ప్రజాప్రతినిధుల ప్రవర్తన సమాజానికి ఆదర్శప్రాయంగా ఉండాలని సూచించారు. అసెంబ్లీ కి కనీసం 50 రోజులైనా హాజరు కావాలనే నిబంధన తప్పనిసరి చేయాలని చెప్పుకొచ్చారు. సభకు హాజరుకాకుండా ప్రభుత్వం గురించి జగన్ మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు అయ్యన్న పాత్రుడు.ఆదివారం తిరుపతిలో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో అయ్యన్నపాత్రుడు పాల్గొని మాట్లాడా రు. తిరుపతి లాంటి మహా పుణ్యక్షేత్రంలో మహిళా సాధికారిక సదస్సు జరగడం మంచి పరిణామమని ఉద్ఘాటిం చారు. మహిళల ఆస్తిలో సగం ఆస్తి ఇచ్చినటువంటి రాష్ట్రం ఆంధ్రప్రదే శ్‌నేనని నొక్కిచెప్పారు. గతంలో ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ఉన్నప్పుడు మహిళల ఆస్తి హక్కు గురించి



చట్టం చేశారని గుర్తుచేశారు అయ్యన్నపాత్రు డు.ఉద్యోగాల్లో మహిళలకు ఎన్టీఆర్ రిజర్వేషన్ తీసుకువచ్చారని ఉద్ఘాటించారు. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలను బలోపేతం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని నొక్కిచెప్పారు. ఒక మహిళను అసెంబ్లీకి స్పీకర్ చేసినటువంటి ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. తిరుపతిలో మహిళ యూనివర్సిటీని పెట్టింది కూడా ఎన్టీఆరేనని గుర్తుచేశారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ హోం మినిస్టర్‌గా వంగలపూడి అనితను పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ముగ్గురు మహిళలకు సీఎం చంద్రబాబు స్థానం కల్పించారని ఉద్ఘాటించారు. మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ విషయాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.

# అసెంబ్లీకి రాకపోతే ఎలా



**అమరావతి:** పలువురు సభ్యులు అసెంబ్లీకి రాకపోయినప్పటికీ జీతం తీసుకుంటున్నారని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. తిరుపతిలో నిర్వహిం చిన జాతీయ మహిళా సాధికారత సదస్సులో అయ్యన్న పాత్రుడు పాల్గొని ప్రసంగించారు. ప్రజలు మనల్నిఎ మ్మెల్యేలుగా ఎన్ను కున్నది ప్రజా స మస్యలు పరిష్క రించడానికి అని అయ్యన్న పాత్రు డు తెలిపారు. ఉద్యోగాలకు రాకపోతే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నామ ని పేర్కొన్నారు. చిరు ద్యోగులు సైతం నో వర్క్ నో పే విధానం అనుసరిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీకి రాకపోతే తీసుకో వాల్సిన చర్యలపై లోక్‌సభ స్పీకర్ మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ఏడాదిలో అసెంబ్లీ స మావే శాలు జరిగేదే రోజులు అని తెలిపారు. వాటికి కూడా రాకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

# ఈనెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల :** ఈనెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. తిరుమలలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 02వ తేదీ వరకు జరుగనున్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలుసందర్భంగా సెప్టెంబర్ 16న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించను న్నారు.ఈ సందర్భంగా సెప్టెంబర్ 15న ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబ డవని సంబంధిత అధికారులు వెల్లడించారు. గమనించి టీటీడీకి సహకరించాలని కోరారు. అష్టదళ పాదపద్మారాధన, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశామన్నారు. తమిళంలో కోయిల్ అంటే 'పవిత్ర పుణ్యక్షేత్రం', ఆళ్వార్ అంటే 'భక్తుడు' , తిరు అంటే ' శ్రేష్ఠ%శీ%', మంజనం అంటే 'స్నానం ' మని అర్థమని అన్నారు. కోయిల్ ఆల్వార్ తిరుమంజనం అంటే గర్భగుడి, ఆలయ ప్రాంగణాన్ని భక్తులు శుద్ధి చేసే కార్యక్రమమని పేర్కొన్నారు.శుద్ధి జరుగుతున్న సమయంలో శ్రీవారి ప్రధాన మూర్తిని ఒక తెల్లని వస్త్రంతో కప్పి ఉంచుతారని వివరించారు. అన్ని దేవతా మూర్తులను, ఇతర వస్తువులను గర్భగుడి నుంచి బయటికి తెచ్చి, కర్పూరం, గంధం, కుంకుమ, పసుపు, కిచ్చిలి గడ్డ మొదలైన వాటితో కూడిన 'పరిమళం' అనే సుగంధ మిశ్రమంతో శుభ్రం చేస్తారని వెల్లడించారు. ఈ మొత్తం కార్యక్రమం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మహా యజ్ఞంల కొనసాగుతుందని తెలిపారు.అనంతరం ప్రధాన దేవతపై ఉన్న వస్త్రాన్ని తొలగించి, లోపల ఇతర పరివార దేవతలు, దీపం , పూజ వస్తువులను లోనికి తీసుకొచ్చిన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పణ ఆగమ శాస్త్రం ప్రకారం జరుగుతుందని తెలిపారు. సంవత్సరానికి నాలుగు సార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి , వార్షిక బ్రహ్మోత్సవాలు ముందు వచ్చే మంగళవారం నాడు ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

# పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత ఆమెకు లేదు



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ మంత్రి రోజాకు లేదని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ విమర్శించారు. పర్యాటక మంత్రిగా రోజా గతంలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని అన్నారు. పవన్ కల్యాణ్ నటుడిగా గతంలో విమానాల్లో తిరిగారని, ఇప్పుడు డిప్యూటీ సీఎంగా విమానాల్లో తిరిగితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు.జబర్దస్త్‌లో డ్యాన్స్ వేసి రోజా చేసిందేమిటి అని కందుల దుర్గేశ్ ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో నటిస్తే తప్పేంటని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ 90 శాతం ప్రజలకు సేవ చేస్తుంటే, కేవలం 10 శాతం మాత్రమే సినిమాలకు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్‌కు మీలా కబ్జాలు, దొంగ వ్యాపారాలు ఉన్నాయా అని నిలదీశారు. పవన్ కల్యాణ్‌కు సినిమాలు మాత్రమే ఉన్నాయని వెల్లడించారు.
రాష్ట్రంలో మెడికల్ కాలేజీలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని కందుల దుర్గేశ్ మండిపడ్డారు. పీపీపీ పద్ధతిలో చేపట్టిన కాలేజీల నిర్మాణం నిర్ణీత సమయంలోగా పూర్తవుతుందని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులపై పూర్తి అజమాయిషీ చేసేహక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని పేర్కొన్నారు. మొదలుపెట్టిన ఏ భవనం కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో 10,644 కోట్ల రూపాయలతో 15 నెలల్లో పర్యాటక రంగానికి పెట్టుబడులు సాధించామని కందుల దుర్గేశ్ తెలిపారు. వీటి ద్వారా 8080 మందికి వీటి ద్వారా ఉపాధి లభించిందని పేర్కొన్నారు. రూ.698 కోట్లతో ఇప్పటికే 88 ప్రాజెక్టులను ప్రారంభించామని చెప్పారు. వీటి ద్వారా 3554 మందికి ఉపాధి లభించిందని అన్నారు. దేశంలో పర్యాటక అభివృద్ధిలో పది రాష్ట్రాలుగా ఒకటిగా ఏపీ తయారు పెట్టుకున్నామని తెలిపారు. ఐదేళ్లలో 25 వేల కోట్లు పర్యాటక పెట్టుబడులు ఆకర్షించాలని చెప్పారు. రాష్ట్రంలో టూరిస్టుల కోసం హెూటల్స్‌ను పెంచాలని నిర్ణయించామని చెప్పారు.

# అధికారంలోకి రాగానే..

# అధికారికంగా విమోచనం



హైదరాబాద్: తెలంగాణలో అధికారంలోకి రాగానే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని బిజెపి చీఫ్ ఎన్.రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపా రు. కేంద్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. నిజాం నిరంకుశ వైఖరిని ఎదిరిస్తూ ప్రజలు చేసిన పోరాటాలు, రజాకార్ల హింసాకాండ గురించి కళ్ళకు అ ద్దినట్లు ఉన్న పలు ఫొటోలను ప్రదర్శించారు. వీటి గురిం చి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మజ్లిస్‌కు భయపడి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అయినా అధికారికంగా నిర్వహించడం లేదని ఆయన విమర్శించారు. అందరూ మజ్లిస్‌కు భయపడి అధికారికంగా నిర్వహించడం లేదన్నారు.
మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలో తాము అధికారంలోకి రాగానే అధికారికంగా నిర్వహిస్తామన్నారు. గత రెండేళ్ళుగా కేంద్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పుడు మూడో సారి నిర్వహించుకోబోతున్నామని ఆయన తెలిపారు. రజాకార్ల హింసాకాండపై ప్రజలు తిరుగుబాటు చేసి సాధించుకున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రసంగిస్తూ తెలంగాణలో అధికారంలోకి రాగానే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించబోయే విమోచన దినోత్సవానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇంకా కేంద్ర మంత్రులు గజేంద్ర షెకావత్, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, మహారాష్ట్రకు చెందిన పలువురు మంత్రులు, రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొంటారు. అదే రోజున ఉదయం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని పార్కులో మాజీ ప్రధాని దివంగత ఎబి వాజ్‌పేయ్ విగ్రహాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరిస్తారు.

# పేర్ని నాని అసత్య ప్రచారాలు చేస్తున్నారు మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్



**కృష్ణా, సెప్టెంబరు14 :** మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం భూములపై అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేవస్థానం భూములపై ఇటీవల దుష్ప్రచారానికి దిగింది వైసీపీ. దేవుడి భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని పేర్ని నాని సంచలన ఆరోపణలు చేశారు. పేర్ని నాని ఆరోపణలను తిప్పికొట్టారు మంత్రి కొల్లు రవీంద్ర.(ఆదివారం) మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వరస్వా మినిమంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం . భక్తుల సమక్షంలో రూ.45లక్షల లీజు చెక్కు అందజేశారు. చెక్కు అందజేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. గొల్లపూడిలో నేషనల్ హైవే పక్కన 40 ఎకరాల దేవస్థానం భూమిని.. రూ.5కోట్లతో విజయవాడ ఉత్సవ కమిటీ అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు మంత్రి కొల్లు రవీంద్ర.మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చిందని ఉద్ఘాటించారు. దేవస్థానం భూములు ఎవ్వరికీ బదలాయింపు జరగడం లేదని స్పష్టం చేశారు. కేవలం విజయవాడ ఉత్సవ్ నిర్వహించడానికే 56 రోజుల పాటు లీజుకు ఇచ్చారని క్లారిటీ ఇచ్చారు. దీని ద్వారా దేవస్థానానికి రికార్డు స్థాయిలో రూ.45 లక్షల ఆదాయం సమకూరిందని నొక్కిచెప్పారు. కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులను కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేవస్థానం భూములు అన్యాక్రాంతం కావని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ దేవస్థానానికి ఈ భూముల ద్వారా మరింత ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.దేవస్థానం భూములను లీజుకు తీసుకున్నాం: ఎంపీ కేశినేని శివనాథ్విజయవాడ ఉత్సవ్ నిర్వహణ కోసమే దేవస్థానం భూములను లీజుకు తీసుకున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు. అది కూడా దేవస్థానానికి భారీ ఆదాయం వచ్చేలా విజయవాడ ఉత్సవ కమిటీ నిర్ణయం తీసుకుందని వివరించారు. 56 రోజులకు రూ.45లక్షల లీజు మొత్తం స్వామివారి సన్నిధిలో ఇచ్చామని తెలిపారు. తాము వేంకటేశ్వరస్వామి భక్తులమని .. ఎలాంటి తప్పు చేయమని ఉద్ఘాటించారు ఎంపీ కేశినేని శివనాథ్.పార్లమెంట్ సమావేశాలు, ఉప రాష్ట్రపతి ఎన్నిక ఉండటంతో కొంత మిస్ కమ్యూనికేషన్ అయిందని చెప్పుకొచ్చారు. మసులా బీచ్ ఫెస్టివల్ స్ఫూర్తితో విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలంతా ఈ ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం వేసవిలో మసులా బీచ్ ఫెస్టివల్.. దసరాకి విజయవాడ ఉత్సవ్ నిర్వహించి తీరుతామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# నేటికి దేశవ్యాప్తంగా బాలికలపై లైంగిక వేధింపులు.



**విజయవాడ, సెప్టెంబర్ 14:** విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ కళాశాలలు, పాఠశాలల్లోని ప్రతి తరగతి గదిలో చార్ట్‌లు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. బాలికలను ఇబ్బంది పెడితే.. ఎటువంటి శిక్షలు ఉంటాయో అందరికీ తెలిసే విధంగా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులతోపాటు పాఠశాల, కళాశాలల సిబ్బందికి ఆయన సూచించారు.బాలికలను ఇబ్బంది పెడితే.. ఎటువంటి శిక్షలు ఉంటాయో అందరికీ తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. తల్లిదండ్రులతోపాటు పాఠశాల, కళాశాలల సిబ్బందికి సూచించారు. వీటిపై చైతన్యం తీసుకురావడం ద్వారా కొంత వరకు అయినా ఈ లైంగిక వేధింపులను అరికట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వీటిపై చైతన్యం తీసుకురావడం ద్వారా కొంత వరకు అయినా ఈ లైంగిక వేధింపులను అరికట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.ఆదివారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఏపీ న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా బాలికల సంరక్షణపై సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రత్యేక అతిథిగా ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేవతి మోహితి ధరె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. 1098కు కాల్ చేయడం ద్వారా ఎటువంటి సాయం అయినా పొందవచ్చనే విషయం ప్రతి ఆడపిల్లకు తెలియాల్సి ఉందన్నారు.ఈ లైంగిక వేధింపులను అరికట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వీటిపై చైతన్యం తీసుకురావడం ద్వారా కొంత వరకు అయినా ఈ లైంగిక వేధింపులను అరికట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఏపీ న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా బాలికల సంరక్షణపై సదస్సు నిర్వహించాయి. నేడు దేశవ్యాప ్తంగా మహిళలు, ఆడపిల్లలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమావేశాలు నిర్వహించడం ద్వారా సమాజానికి సైతం చట్టాలపై అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా మహిళల బాధలను ఈ సమాజం చూస్తూనే ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయినా.. ప్రతి రోజు మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఇంట్లో కూడా ఆడపిల్ల, మగపిల్లవాడు తల్లిదండ్రులకు ఆయన స్పష్టం చేశారు. అందరూ సమానమనే భావన చూపిస్తే.. వారిలోనూ ఆత్మస్థైర్యం పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల బాల్య వివాహాలు చేసి ఆడపిల్లల బరువు వదిలించుకునే కుటుంబాలు ఈ సమాజంలో నేటికి ఉన్నాయన్నారు.అందుకే వారి సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు చేసినా.. కొంతమందికి వాటిపై అవగాహన ఉండటం లేదని చెప్పారు. 13 నుంచి 15 ఏళ్ల వయస్సు ఉన్న ఆడపిల్లల్లు అత్యధికంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారని వివరించారు. లైంగిక వేధింపులకు గురైన పిల్లలు మానసికంగా ఇబ్బందిని ఎదుర్కుంటారని తెలిపారు. వారికి మనోధైర్యం కల్పించి.. సమాజంలో ఎదిగేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ లైంగిక వేధింపులకు గురైన బాధితులకు చట్టపరంగా సేవలు అందించాలని న్యాయకమిటీలకు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# తేజస్వియాదవ్ పర్యటనలో కలకలం సెక్యూరిటీని చేధించుకుని దూసుకొచ్చిన యువకుడు

**బీహార్ :** బీహార్‌లో ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ పర్యటనలో భద్రతాలోపం తలెత్తింది. ముజఫర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి యాదవ్.. హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఓ యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగుపరుగున ఆయన దగ్గరికి వచ్చి పాదాలపై పడ్డాడు.దీనికిముందు ముజఫం పూర్‌లోని కాంతి స్కూల్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అప్పుడే నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని చేధించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపైపడ్డాడు. దాంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు యువకుడి పేరు షరీఫుల్ ఇస్లామ్‌గా



గుర్తించారుఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తేజస్వి యాదవ్‌పై ఉన్న అభిమానానికి ఇది నిదర్శనమని కొందరు.. తీవ్రమైన భద్రతాలోపమని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. బీహార్‌లో ఈ తరహా భద్రతాలోపం తలెత్తడం ఇదే ప్రథమం కాదు. గతంలోనూ ఇలాంటి భద్రతాలోపాలు చోటుచేసు కున్నాయి. ఆగస్టులో 'ఓటర్ అధికార్ యాత్ర'లో గుర్తుతెలియని వ్యక్తి భద్రతావలయాన్ని ఛేదించుకుని వచ్చి రాహుల్‌గాంధీని ముద్దు పెట్టుకున్నాడు. రాహుల్‌గాంధీ పూర్నియాలో తేజస్వి యాదవ్‌తో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది.

# ఒకప్పుడు దేశ ప్రధానులు, సీఎంలను అందించిన పార్టీలు

**బీహార్ :** దేశానికి ప్రధానులను, బిహార్‌కు ముఖ్యమంత్రులను అందించిన పలు రాజకీయ పార్టీలు కాలక్రమంలో కనుమరుగయ్యాయి. వాటి నుంచి పుట్టిన పార్టీలు ప్రస్తుతం దేశ, బిహార్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంకొన్ని పార్టీలు ఎన్నికలప్పుడు అంతమాత్రంగా ఓట్లను దక్కించుకుని నెట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి, పూర్తిగా ప్రాభవాన్ని కోల్పోయిన పార్టీలేవో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ఆ పార్టీలు ఇప్పుడు లేవు!మొరార్జీ దేశాయ్, దేవేగౌడ, ఇందర్ కుమార్ గుజ్రాల్, చౌదరి చరణ్ సింగ్, వీపీ సింగ్, చంద్రశేఖర్ వంటి ప్రధానులను, కర్పూరి ఠాకూర్ వంటి పలువురు సీఎంలను అందించిన పార్టీలు ఇప్పుడు అంతగా ప్రాచుర్యం లేవు. కొన్ని పార్టీలు ప్రాభవాన్ని కోల్పోయాయి. ఇంకొన్ని వేరే పార్టీలో విలీనం అయిపోయాయి. ఒకప్పుడు పవర్ ఫుల్?గా ఉన్న పార్టీలు ఇప్పుడు శక్తిహీనంగా తయారయ్యాయి. ఆ పార్టీల చీలిక వల్ల ఏర్పడిన చిన్న పార్టీలు ప్రస్తుతం దేశ, బిహార్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జనతా పార్టీ, జనతాదళ్, సంయుక్త సోషలిస్ట్ పార్టీ, లోక్ దళ్ వంటి పార్టీలు ఇప్పుడు దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కనుమరుగయ్యాయి. ఉవ్వెత్తున్న ఎగసిన జనతా పార్టీ జనతా పార్టీ 1977 జనవరి 23న ఏర్పడింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఆర్గనైజేషన్, భారతీయ జనసంఘ్, భారతీయ లోక్ తాంత్రిక్ సోషలిస్ట్ పార్టీ సహా మరికొన్ని పార్టీల కలయికతో జనతా పార్టీ ఏర్పడింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారును ఓడించి జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో జనతా పార్టీ తరపున మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రి అయ్యారు. అలాగే జనతా పార్టీ బిహార్



సహా 7 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందింది. దీంతో బిహార్ జనతా పార్టీ చీఫ్ సత్యేంద్ర నారాయణ్ సిన్హా ముఖ్యమంత్రి అయ్యారు. కానీ ఆయన బిహార్ ప్రభుత్వాన్ని రెండేళ్లు కూడా నడపలేకపోయారు. 1980 ఎన్నికలలో కాంగ్రెస్ మళ్లీ బిహార్‌లో అధికారంలోకి వచ్చింది. అందుకు ప్రధాన కారణం జనతా పార్టీ విచ్ఛిన్నం.ఐదుగా చీలిపోయిన జనతా పార్టీ1980 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి విడిపోయిన ఐదు పార్టీలు విడివిడిగా పోటీ చేశాయి. బిహార్‌లో ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీ విజయానికి ఇదే ప్రధాన కారణం అయ్యింది. ఎందుకంటే ఐదు పార్టీలు ఒకదానికొకటి వేర్వేరుగా ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల ఓట్లు చీలిపోయాయి. దీంతో కాంగ్రెస్ మరోసారి అధికారాన్ని చేజిక్కుకుంది. ఈ విధంగా, జనతా పార్టీ కేంద్రం లోనే కాకుండా బిహార్‌లో కూడా అధికారం కోల్పోయింది.లోక్ దళ్ విలీనం మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌కు చెందిన లోక్ దళ్‌లో 1982లో చీలిక ఏర్పడింది. ఒక వర్గానికి చరణ్ సింగ్ నాయకత్వం వహించగా, మరొక వర్గానికి కర్పూరి ఠాకూర్, మధు లిమాయే, బిజు పట్నాయక్, దేవీ లాల్, జార్జ్ ఫెర్నాండెజ్ వంటి నాయకులు నేతృత్వం వహించారు. 1983లో కర్పూరి ఠాకూర్ నేతృత్వంలోని లోక్ దళ్, జనతా పార్టీలో విలీనం అయ్యింది. అదే సమయంలో చరణ్ సింగ్ వర్గంలోని లోక్ దళ్ కూడా 1988లో జనతా పార్టీలో విలీనం అయింది. దీంతో లోక్ దళ్ పార్టీ పూర్తిగా కనుమరుగైంది.విచ్ఛిన్నమైన జనతాదళ్1988 అక్టోబర్ 11న జేపీ నారాయణ్ జయంతి సందర్భంగా వీపీ సింగ్ జనతాదళ్‌ను స్థాపించారు. 1989లో బోఫోర్స్ కుంభకోణం ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. దీంతో వీపీ సింగ్ నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించి ప్రధాని అయ్యారు. ఆయనకు లెఫ్ట్ ఫ్రంట్, బీజేపీ బయటి నుంచి మద్దతు ఇచ్చాయి. జన్ మోర్చా, జనతా పార్టీ వర్గం, లోక్ దళ్ వర్గం, కాంగ్రెస్ జగ్జీవన్, తమిళ మున్నేట్ర మున్నాని వంటి పార్టీలు జనతాదళ్‌లో చేరాయి. 1996లో జనతాదళ్ యునైటెడ్ ఫ్రంట్ కింద ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ మెజారిటీ రాకపోవడంతో అది కాంగ్రెస్? మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే, ఆ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగలేదు. దీని తర్వాత, జనతాదళ్ వివిధ వర్గాలుగా విచ్ఛిన్నం కావడం ప్రారంభించింది. దీనిలో బిజు జనతాదళ్, రాష్ట్రీయ జనతాదళ్, జనతాదళ్ సెక్యులర్, జనతాదళ్ యునైటెడ్ వంటి ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. దీంతో అసలైన జనతాదళ్ పూర్తిగా కనుమరుగైంది.

# 14 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీ

**విశాఖపట్నం:** భారతీయ జనతా పార్టీ 14 కోట్ల మంది సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా నిలిచిందని పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఈ 14 కోట్ల మందిలో 2 కోట్ల మంది యాక్టివ్ మెంబర్స్ ఉన్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం లో ఆదివారంనాడు జరిగిన పార్టీ ర్యాలీలో ఆయన ఈ విషయాలు తెలిపారు.'ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ మనది. ఇందులో 14 కోట్ల మంది సభ్యులు ఉన్నాయి. దేశంలోని 20 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్నాయి. 13 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉంది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అతి పెద్ద పార్టీ కూడా బీజేపీనే. పార్టీకి 240 మంది ఎంపీలు ఉన్నారు. సుమారు 1,500 మంది ఎమ్మెల్యేలు, 170కి పైగా ఎమ్మెల్సీలు



ఉన్నారు' అని నడ్డా చెప్పారు.మోదీ నాయకత్వంపై ప్రశంసలుప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై నడ్డా ప్రశంసలు కురిపించారు. ఎన్డీయే పాలనను బాధ్యతకలిగిన, స్పందించే పాలనగా అభివర్ణించారు. గత 11 ఏళ్ల మోదీ నాయకత్వంలో సమర్థవంతమైన పనితీరుతో పాటు జవాబుదారీ ప్రభుత్వాన్ని అందించామని చెప్పారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15,000 కోట్లు సమకూర్చిందని చెప్పారు.సైద్ధాంతికి పునాదులు కలిగి పార్టీ నుంచి తాము వచ్చామని, గతంలో రాజకీయాలన్నీ కుటుంబం, అవినీతి, బుజ్జగింపు రాజకీయాల చుట్టూనే నడిచాయని కాంగ్రెస్ పార్టీపై నడ్డా విమర్శలు కురిపించారు. గత ప్రభుత్వాల హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని అన్నారు.

# నా మేథస్సు విలువ నెలకు రూ.200 కోట్లు, డబ్బుకు కొదవలేదు

**నాగపూర్:** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతుండటం, ఈ చర్య ద్వారా వ్యక్తిగత లబ్ధి పొందారంటూ తనపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన మేధస్సు విలువ నెలకు రూ.200 కోట్లు అని, ఆర్థిక ప్రయోజనాల కోసం దిగజారే ప్రసక్తే లేదని చెప్పారు. నాగపూర్‌లోని అగ్రికోస్ వెల్ఫేర్ సొసైటీ కార్యక్రమంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు.'ముందుగా ఒక మాట చెప్పనీయండి. ఇదంతా సొంత సంపాదన కోసం చేయడం లేదు. నేను చెప్పకుంటే మీరు మరో రకంగా ఆలోచించవచ్చు. నాకు పుష్కలంగా ఆదాయం ఉంది. నా మెదడు విలువ.. నెలకు రూ.200 కోట్లు. నాకు డబ్బుల కొరత లేదు' అని అన్నారు. తన కుమారులకు తాను ఐడియాలు ఇస్తుంటానని, అవకతవకలకు ఎప్పుడూ పాల్పడేది



లేదని స్పష్టం చేశారు.ఈ-20 పెట్రోల్ వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంపై చర్చ జరుగుతుండగా, గడ్కరీపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఇథనాల్‌పై ప్రభుత్వ విధానం వల్ల కేంద్ర మంత్రి కుమారులు ప్రయోజనం పొందారని, ఇందువల్లే ఇథనాల్ ప్రొడక్షన్‌పై చురుగ్గా లాబీయింగ్ చేస్తున్నారని విమర్శించింది.పెయిడ్ క్యాంపెయిన్గా, ఇదంతా తనపై జరుగుతున్న 'పెయిడ్ సోషల్ మీడియా క్యాంపెయిన్'గా గడ్కరి కొట్టివేశారు. సోషల్ మీడియా ప్రచారం పెయిడ్ ప్రచారమని.. ఇథనాల్‌కు వ్యతిరేకంగా, రాజకీయంగా తనను టార్గెట్ చేసేందుకు జరుగుతున్న ప్రచారమని తెలిపారు.

# ర్యాలీలతో లండన్ ఉద్రిక్తం
# ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు

**లండన్:** నగరం ఉద్రిక్తతలకు వేదికగా మారింది. వేలమంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనల ను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరుగగా.. మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు. అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు.అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది.కొన్ని ఐసీ చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలుపెట్టింది. వీటిని




అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండక్టర్లపై అమెరికా వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్ ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ కానున్నారు. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లు వంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది.శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎమ్ఐసీ కూడా ఉంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు తన గురిని చైనాపై పెట్టారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా సంకేతం పంపారు.భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థ నాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5 వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.

# సూసైడ్ ప్లాన్‌లో పిల్లలు, భర్త మృతి బతికిన భార్య

**బెంగళూరు:** తమ పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకోవాలని భార్యాభర్తలు ప్లాన్ వేశారు. తొలుత ఇద్దరు పిల్లలను చంపారు. ఆ తర్వాత భర్త ఆత్మహత్య చేసుకోగా భార్య బతికిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.




హొసోకోట్ తాలూకాలోని గోనకనహల్లి గ్రామంలో 32 ఏళ్ల శివు, భార్య మంజుల తమ ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. కొన్నేళ్ల కిందట అతడు ప్రమాదానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు.కాగా, కుటుంబ ఆర్థిక సమస్యలు పెరుగడంతోపాటు భార్యపై అనుమానం వల్ల దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కొంతకాలంగా సూసైడ్ చేసుకోవాలన్న భావనలో శివు, మంజుల ఉన్నారు. అయితే పిల్లలు ఒంటరవుతారని వారు భావించారు. ఈ నేపథ్యంలో తొలుత పిల్లలను చంపి ఆ తర్వాత వారిద్దరూ ఆత్మహత్య చేసుకోవాలని ప్లాన్ చేశారు.

మరోవైపు శనివారం మధ్యాహ్నం శివు, మంజుల కలిసి మద్యం సేవించారు. సాయంత్రం 4 గంటల సమయంలో తొలుత 11 ఏళ్ల కుమార్తె చంద్రకళ గొంతునొక్కి చంపారు. ఆమె మరణించిందా లేదా అన్న నిర్ధారణ కోసం కుమార్తె తలను నీటిలో ముంచారు. ఏడేళ్ల కుమారుడు ఉదయ్ సూర్యను కూడా అదే విధంగా చంపారు.కాగా, ఆ తర్వాత ఉరి వేసుకోవడానికి మంజుల ప్రయత్నించింది. అయితే అనారోగ్యంతో వాంతి చేసుకున్న భర్త శివు సమీపంలోని షాపు నుంచి ఆహారం కొని తీసుకురావాలని చెప్పాడు. ఆమె తిరిగి వచ్చేసరికి శివు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాను ఆత్మహత్య చేసుకునే ముందు పొరుగింటి వారి ఫోన్‌లో తండ్రితో మంజుల మాట్లాడింది. జరిగిన విషయం చెప్పింది.మరోవైపు ఇది విన్న పొరుగింటి వారు షాక్ అయ్యారు. మంజుల ఇంటికి వెళ్లి చూడగా ఆమె పిల్లలు, భర్త శివు చనిపోయి కనిపించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. ఇద్దరు పిల్లలు, భర్త మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంజులను అదుపులోకి తీసుకుని ఆమెను ప్రశ్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# 243 స్థానాల్లో పోటీ సై



**ముజాఫర్ పూర్:** మహాఘట్బంధన్ కూటమి గొంతులో వెలక్కాయను ఆర్జేడీ నేత తేజస్వి ప్రసాద్ యాదవ్‌కుక్కారు. రాబోయే ఎన్నికల్లో 243 అసెంబ్లీ స్థానాల్లోపోటీ చేస్తానని ప్రకటించి, మహాఘట్బంధన్ లో సింహభాగం సీట్లు తనవేనని తేల్చిచెప్పారు. ముజఫర్ పూర్‌లోని కాంతిలో జరిగిన కార్మికుల ర్యాలీలో ఈ ప్రకటన చేశారు. మహాఘట్బంధన్‌లో సీట్ల పంపకాల చర్చలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇక్కడి కాంతి హైస్కూల్‌లో కిక్కిరిసిన జనసమూహాన్ని ఉద్దేశించి ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై విమర్శనాస్త్రాలు సంధించారు. మేము తిరిగి వస్తాం. అర్థం చేసుకోండి, బీహార్‌లోని 243 సీట్లలోనూ తేజస్వి పోటీ చేస్తారు.బీహారీ సీట్ల కుంపటిముజఫర్ పూర్, బోచాహన్, గైఘాట్ కాంతితో సహా నియోజకవర్గాల పేర్లను ఆయన ప్రస్తావించారు, కార్మికులను సిద్ధంగా ఉండాలని కోరారు. యాదవ్ ప్రస్తావించిన ముజఫర్‌పూర్‌ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే నిర్వహిస్తున్నారు. సీట్ల పంపకాల చర్చల సమయంలో కూటమి భాగస్వాములపై ఒత్తిడి తీసుకురావడమే ఈ సందేశం లక్ష్యంగా పెట్టుకుందనే ఊహాగానాలకు ఆజ్యం పోస్తున్నారు. యాదవ్ ప్రకటన రాజకీయంగా చాలా ముఖ్యమైనది. ఇటీవల మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి అడిగినప్పుడు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రత్యక్ష సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారు. ఈ స్థితిలో యాదవ్ ప్రకటన తో తారాస్థాయి చర్చ రగులుతోంది.

# అస్సాంలో 5.8 తీవ్రతతో భూకంపం బెంగాల్‌లోనూ ప్రకంపనలు



**డిస్పూర్:** అస్సాం లో ఆదివారంనాడు భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాకు 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం గుర్తించారు. 5 కిలోమీటర్ల లోతుగా ఇది సంభవించినట్టు అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్, భూటాన్‌లో ప్రక ంపనలు వచ్చాయి.అస్సాంలో భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళనలకు గుర య్యా రని, పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారని తెలుస్తోంది. పరిస్థితిని డిజాస్టర్ మేనేజి మెంట్ బృందాలు చురుకుగా సమీక్షిస్తున్నాయి. కాగా, ఈ ఘటనలో ఎవరూ గాయపడినట్టు సమా చారం లేదని, తమ టీమ్‌లు అప్రమత్తంగా ఉన్నాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపా రు.పరి స్థితిని సమీక్షిస్తున్నాం: సీఎంఉదల్గురిలో 5.6 తీవ్రతతో భూకంపం సంభవించిందని, అయితే ఎలాం టి ప్రాణనష్టం జరగలేదని సమాచారం ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సామా జిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని తెలిపా రు.అస్సాంలో భూకంపం సంభవించిందని, ప్రజల భద్రత కోసం ప్రార్థిస్తున్నానని కేంద్ర మంత్రి, మాజీ ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్ సోమాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అప్రమ త్తంగా ఉండాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలో ఉన్నారు.



# చిరంజీవితో 'మిరాయ్' దర్శకుడు సినిమా

తేజ సజ్జా, మంచు మనోజ్, శ్రియ కీలక పాత్రల్లో నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ మిరాయ్... దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రంతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు పొందాడు. సుమారు పదేళ్లుగా సినీ రంగంలో ఉన్న ఆయన మిరాయ్‌తో భారీ హిట్ అందుకున్నారు. అయితే, తాజాగా మెగాస్టార్ చిరంజీవితో కార్తీక్ సినిమా ఛాన్స్ దక్కించుకున్నాడు. కానీ, దర్శకుడిగా కాదు. వాల్తేరు వీరయ్య విజయం తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో మరో సినిమా రానున్న విషయం తెలిసిందే. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించే అవకాశముంది. త్వరలోనే సెట్స్ మీదకు ఈ ప్రాజెక్ట్ వెళ్లనుంది. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్‌గా కార్తిక్ ఘట్టమనేని చేయబోతున్నారు. మెగాస్టార్‌తో తొలిసారి ఆయనకు ఛాన్స్ రావడంతో ఆయన సంతోషంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్ను కోరి, ఎక్స్‌ప్రెస్ రాజా,ధమాకా, కార్తీకేయ, చిత్రలహరి వంటి సినిమాలకు ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. తాజాగా విడుదలైన మిరాయ్ మూవీ సినిమాటోగ్రాఫర్ కూడా కార్తిక్ కావడం విశేషం. సినిమాటోగ్రాఫర్‌గా కార్తీక్‌కు మంచి గుర్తింపు ఉంది. దర్శకుడిగా పనిచేస్తూనే ఆయన తన కెమెరాకు కూడా పని చెప్తారు. డైరెక్టర్‌గా తొలిచిత్రం సూర్య వర్సెస్ సూర్య తర్వాత మిరాయ్‌తో భారీ హిట్ అందుకున్నారు.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న బెల్లంకొండ 'కిష్కిందపురి'

టాలీవుడ్‌లో యువ హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటున్న బెల్లంకొండ శ్రీనివాస్‌కు తాజాగా విడుదలైన 'కిష్కిందపురి' చిత్రం అద్భుతమైన విజయాన్ని అందించింది. వివిధ జానర్‌లలో సినిమాలు చేస్తూ వెళ్తున్న బెల్లంకొండ శ్రీనివాస్.. గతంలో 'జయ జానకి నాయక'తో యాక్షన్ ఎంటర్టైనర్‌గా, 'రాక్షసుడు'తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను మెప్పించారు. ఇప్పుడు 'కిష్కిందపురి'తో హారర్ జానర్‌లో అదరగొట్టారు. సెప్టెంబర్ 12న విడుదలైన 'కిష్కిందపురి' చిత్రం మొదటి రోజు నుంచే సూపర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ మార్కును దాటేసి టాలీవుడ్‌లో ఒక సంచలనంగా నిలిచింది. పక్కా హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు మౌత్ టాక్ బాగా కలిసొచ్చింది. మొదటి రోజు 50 వేల టికెట్లు అమ్ముడవగా.. రెండో రోజు ఏకంగా 75 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. ఇటీవలి కాలంలో టాలీవుడ్‌లో హారర్ సినిమాలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోతున్నాయి. అలాంటి సమయంలో 'కిష్కిందపురి' మంచి కథ, కథనంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చిందని చెప్పవచ్చు. సినిమా కథనంలో అనవసరమైన హంగులు లేకుండా అనుకున్న పాయింట్‌ను స్పష్టంగా తెరపై చూపించడంలో చిత్ర బృందం సక్సెస్ అయింది.

# ప్రముఖ దర్శకుడికి డాక్టరేట్ ప్రదానం



ప్రముఖ చిత్ర దర్శకుడు వెట్రిమారన్ గౌరవ డాక్టరేటు పొందారు. చెన్నైలోని ప్రముఖ యూనివర్సిటీ వేల్స్ ఇన్‌స్టిట్యూట్ తరపున ప్రదానం చేశారు. చెన్నైలోని పల్లవరంలో ఉన్న వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 15వ స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. సినీ పరిశ్రమలో అద్భుత విజయం సాధించిన శ్రీ గోకులం గ్రూప్ వ్యవస్థాపకుడు ఛైర్మన్ ఎ.ఎం. గోపాలన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేక చిత్రాలకు దర్శకత్వం వహించి జాతీయ అవార్డులు గెలుచుకున్న దర్శకుడు వెట్రి మారన్‌కు గౌరవ డాక్టరేట్‌లను వారు ప్రదానం చేశారు. వడచెన్నై, అసురన్, విడుదలై, ఆడుకాలమ్,కాక్క ముట్టై వంటి అవార్డ్ విన్నింగ్ చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. అనంతరం క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన క్రికెటర్ అశ్విన్‌కు కూడా గౌరవ డాక్టరేట్ అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 4,992 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వేల్స్ ఎడ్యుకేషన్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతా గణేశ్, రిజిస్ట్రారర్ డాక్టర్.పి.శరవణన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్.ఎం.భాస్కరన్, అసోసియేట్ ఛాన్సలర్ డాక్టర్.ఎ.జ్యోతి మురుగల్, ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గతంలొ ఇదే యూనివర్సిటీ నుంచి మెగా హీరో రామ్ చరణ్ కూడా గౌరవ డాక్టరేట్ పొందారు.

# సినిమాలు వదిలేసి జ్యోతిష్కురాలిగా మారిన హీరోయిన్.. 700 కోట్ల కంపెనీకి యజమాని..

సినీరంగంలో నటీనటుల అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. ఇండస్ట్రీలో స్టార్ డమ్ ఉన్న చాలా మంది హీరోయిన్లు వేరే రంగాన్ని సైతం ఎంచుకుంటున్నారు. నటన నుండి కొత్త రంగాన్ని ఎంచుకున్న అలాంటి నటి ఒకరు ఉన్నారు. ఒకప్పుడు టాప్ హీరోయిన్. ఇప్పుడు మాత్రం జ్యోతిష్యం చెబుతుంది. బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో స్టార్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. అప్పట్లో ఆమె అందం, నటనకు ఫాలోయింగ్ ఎక్కువగా ఉండేది. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ పేరు తులిప్ జోషి. యష్ రాజ్ ఫిల్మ్స్ చిత్రం 'మేరే యార్ కి షాదీ' ద్వారా నటి తులిప్ సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె అభిమానుల మనస్సులలో ఆమెకు భిన్నమైన ఇమేజ్‌ను సృష్టించింది. ఆమె రాత్రికి రాత్రే స్టార్ అయ్యింది. కానీ కొన్ని సినిమాలు చేసిన తర్వాత, ఆమె బాలీవుడ్‌ను విడిచిపెట్టి నటనకు దూరంగా ఉంది. తులిప్ జోషికి స్కూల్ రోజుల నుంచే మోడలింగ్ ఆఫర్లు రావడం ప్రారంభించాయి. కానీ ఆమె గ్రాడ్యుయేషన్ తర్వాతే సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. తులిప్ జోషి మొదటి సినిమా 'మేరే యార్ కి షాదీ హై'. 2014లో, ఆమె సల్మాన్ ఖాన్ నటించిన 'జై హెూ' చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత ఆమె సినిమాలకు దూరమయ్యింది. ప్రస్తుతం సినిమాలు వదిలేసి తులిప్ ఎంచుకున్న రంగం జ్యోతిష్యం. ఇప్పుడు ఆమె జ్యోతిష్కురాలిగా మారింది. అంతే కాదు, ఆమె తన భర్త కంపెనీని కూడా నిర్వహిస్తోంది. తులిప్ జోషి భారత సైన్యంలో కెప్టెన్‌గా ఉన్న వినోద్ నాయర్‌ను వివాహం చేసుకుంది. వినోద్ భారత సైన్యంలోని పంజాబ్ రెజిమెంట్‌లోని 19వ బెటాలియన్‌లో %జూ%గా ఉన్నారు. 1995 వరకు భారత సైన్యంలో పనిచేసిన తర్వాత వినోద్ నాయర్ సైన్యం నుండి రిటైర్ అయ్యి బిజినెస్ రంగంలో రాణిస్తున్నారు. ప్రస్తుతం అతడు కిమ్మాయ అనే కన్సల్టింగ్ కంపెనీని రన్ చేస్తున్నారు. ఇప్పుడు ఆ కంపెనీ విలువ రూ.700 కోట్లు.



# మృణాల్ ఠాకూర్ బ్యూటీ సీక్రెట్ ఇదే..! సోషల్ మీడియాలో రివీల్ చేసిన హీరోయిన్..!

'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీ-ఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది. వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్థంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది. ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ.2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట. భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠి కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులోకి 'సీతారామం'తో పరిచయమైంది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ సాధించడంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు మారుమోగింది. అయితే, అవకాశాలు మాత్రం ఎక్కువగా రాలేదు. టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్ నాని సరసన హాయ్ నాన్న, విజయ్ దేవరకొండ సరసన ఫ్యామిలీ స్టార్ సినిమాల్లో నటించింది. ప్రభాస్ కల్కి 2898 ఏడీ చిత్రంలో చిన్న పాత్రలో మెరిసింది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613